


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 30-01-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 123 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## సీనియర్ ఐఏఎస్‌లకు పదోన్నతులు

అమరావతి: రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐఏఎస్‌లకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ముఖ్య కార్యదర్శులు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా... కార్యదర్శులు ముఖ్యకార్యదర్శులుగా పదోన్నతి పొందారు. మరికొందరు సంయుక్త కార్యదర్శులుగా పనిచేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీలుగా ఉన్న రజత్ భార్గవ్, జవహర్‌రెడ్డి, అనంతరాము, ప్రవీణ్ కుమార్... స్పెషల్ చీఫ్ సెక్రటరీలుగా పదోన్నతులు పొందారు.

అదే విధంగా... సెక్రటరీ హోదాలో ఉన్న జి.జయలక్ష్మి, ఉషారాణి, రామ్‌గోపాల్‌కు ప్రిన్సిపల్ సెక్రటరీలుగా... జాయింట్ సెక్రటరీలుగా ఉన్న ముత్యాలరాజు, బసంత్‌కుమార్ పదోన్నతి పొందారు. ఇదిలా ఉండగా... ఇంటర్ క్యాడర్ ట్రాన్స్‌ఫర్ల ద్వారా ఏపీకి ఇద్దరు ఐఏఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో నాగాలాండ్, యూపీ క్యాడర్‌కు చెందిన.. మంజిర్ జిలానా సమూన్, తమీమ్ అన్సారియాకు విశాఖలో పోస్టింగ్ లభించింది. వీఎంఆర్డీఏ అదనపు కమిషనర్‌గా మంజిర్ జిలానీ సమూన్, జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా తమీమ్ అన్సారియాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## పార్టీలకతీతంగా
# పేదలందరికీ ఇళ్ల స్థలాలు
### విశాఖలో పేదలకు ఇళ్ల స్థలాలపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: విశాఖపట్నంలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో వైజాగ్ కార్పొరేషన్, హౌజింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## టీమిండియాలో రోహిత్



వార్త 8వ పేజీలో..

## రాజధాని మార్పుపై దుష్ప్రచారం చేయిస్తున్నారు
### మార్పు మాత్రం ఆలస్యం కాదు .. మంత్రి బొత్స సత్యనారాయణ



తాడేపల్లి : రాజధాని విషయంపై చంద్రబాబు నాయుడు తన ఎల్లో మీడియాతో దుష్ప్రచారం చేయిస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఎల్లో మీడియా అనుకున్నట్లు రాజధాని మార్పు ఆలస్యం కాదని స్పష్టం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బోస్టన్, జీఎన్‌రావు కమిటీ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించాకే మూడు రాజధానులపై నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జీఎన్ రావు కమిటీని పనికిమాలిన కమిటీ అన్న చంద్రబాబు.. మళ్లీ ఇప్పుడు జీఎన్ రావు కమిటీ వైజాగ్‌లో ప్రకృతి వైపరీత్యాలు వస్తాయని చెప్పిందంటూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన ఎల్లో మీడియాతో ఇష్టం వచ్చినట్లు తరువాయి 2లో..

## ఉగాది నాటికి 25 లక్షల ఇళ్ల స్థలాలు
### ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేస్తాం
### జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పేర్ని నాని



పశ్చిమ గోదావరి: పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి స్థానిక రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని పేర్ని నాని అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన డీడీఆర్‌సీ సమావేశంలో తరువాయి 2లో..

## శాసన మండలి రద్దుపై రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తాం
### బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ శాసన మండలి రద్దుపై కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు స్పష్టం చేశారు. శాసనమండలిని రద్దు చేస్తూ ఏపీ అసెంబ్లీ చేసిన తీర్మానానికి కేంద్రం అడ్డు చెప్పే అవకాశం లేదని ఆయన తెలిపారు. బుధవారం తరువాయి 2లో..



## ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌కు విశాఖ బెస్ట్
### రాజధాని వద్దని సూచన
### సముద్రతీరం ప్రమాదకరం
### జీఎన్‌రావు కమిటీ వెల్లడి

హైదరాబాద్: విశాఖకు ఉత్తరప్రాంతంగా ఉన్న చోట.. సెక్రటేరియట్ పెట్టుకోవచ్చని తరువాయి 2లో..

## బిజెపి పథకాలకు ఆకర్షితురాలినై..
### బిజెపిలో చేరిన స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ నెహ్వాల్



న్యూఢిల్లీ: భారత స్టార్ బ్యాండ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ బీజేపీలో చేరారు. ఇప్పటిదాకా బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సైనా ఇక నుంచి రాజకీయాల్లో తనదైన ముద్రవేయనున్నారు. గతంలో అనేక సార్లు సైనా నెహ్వాల్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె ఢిల్లీలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయానికి చేరుకొని పార్టీ జాతీయాధ్యక్షుడు నడ్డా సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ జనరల్ సెక్రటరీ అరుణ్‌సింగ్ ఆమెకు సభ్యత్వ రసీదు చేశారు. ఈ సందర్భంగా సైనా మాట్లాడుతూ.. బీజేపీ చేరడం గర్వంగా ఉందన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయనున్నట్లు తెలిపారు. 29 ఏళ్ల సైనా.. 20 ఇంటర్నేషనల్ టైటిల్స్‌ను గెలుచుకున్నారు. 2009లో వరల్డ్ నంబర్ 2, 2015 సంవత్సరంలో వరల్డ్ నంబర్ వన్ స్థానానికి ఎదిగారు. ప్రస్తుతం ఆమె తొమ్మిదో ర్యాంకులో కొనసాగుతున్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు కోసమే మండలి రద్దు నిర్ణయం
### మంత్రి మోపిదేవి వెంకటరమణ



అమరావతి : ఏపీ శాసనమండలి రద్దుపై కేంద్రం సానుకూలంగానే స్పందిస్తుందని ఆశిస్తున్నట్టు మంత్రి మోపిదేవి వెంకటరమణ తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా మండలి రద్దుకు ప్రభుత్వం చట్ట ప్రకారం తీర్మానం చేసిందని తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసమే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తన నేతలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. పేద విద్యార్థులకు మేలు చేసే ఇంగ్లిష్ మీడియం బిల్లును టీడీపీ మండలిలో అడ్డుకుందని మండిపడ్డారు. పెద్దల సభ అంటే ప్రభుత్వానికి తరువాయి 2లో..




## కాంగ్రెస్ బలమైన పార్టీగా పుంజుకుంటుంది
### కాంగ్రెస్ నేత రఘువీరా రెడ్డి



అమరావతి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలమైనదిగా పుంజుకుంటుందని, రాష్ట్రాన్ని నడపగలిగిన సత్తా కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉందని భావిస్తున్నానని ఏపీసీసీ నూతన చీఫ్ శైలజనాథ్‌పై ఆ పార్టీ నేత రఘువీరారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం ఏపీసీసీ నూతన చీఫ్‌గా శైలజనాథ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తులసిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి



# గీతంలో ఘనంగా "ఇంజనీయో" వేడుకలు





సాగర్‌నగర్ : గీతం రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో "ఇంజనీయో 7.0" పేరిట నిర్వహిస్తున్న సేవా ఉత్సవాలు బుదవారం తేది: 29-1-2020న ఘనంగా ముగిసాయి. గ్రామీణ ప్రాంతాలలో, పాఠశాలలో గీతం రోటరాక్ట్ క్లబ్ గత ఏడాది నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమాలతో విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది.

ఈ రోటరాక్ట్ క్లబ్ ఉత్సవంలో భాగంగా అనాధబాలలు, మానసిక వికలాంగులైన బాలలతో సాంస్కృతిక కార్యక్రమాలు బుదవారం విశ్వవిద్యాలయం ఆవరణలోని బాలయోగి కళాప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అలాగే విద్యార్థులకు ఫోటోగ్రఫీ, చదరంగం, మినిట్ టూ విన్ హిట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ ముఖ్యఅతిథిగా హజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థి వ్యవహరాల విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం రోటరాక్ట్ క్లబ్ గీతం ఫాకల్టీ సలహదారు డాక్టర్ మురళీకృష్ణ, క్లబ్ విద్యార్థి విభాగం అద్యక్షుడు ప్రేమ్‌సింగ్, రోటరాక్ట్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



నర్సీపట్నం : ప్రతీ ఒక్క వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని నర్సీపట్నం ఎంవి ఇన్‌స్పెక్టర్ సంజీవరావు అన్నారు. 31వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెదబొడ్డేపల్లి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు మనస్సు డ్రైవింగ్ పై లన్నం చేయాలని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని హితవు పలికారు. అతి వేగమే రోడ్డు ప్రమాదాలకు కారణమౌతుందని అన్నారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని చెప్పారు. వాహన చోదకులు డ్రైవింగ్‌లో స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు తమ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టరాదని చెప్పారు. డ్రైవర్ తనకు అనుకూలంగా ఉండేలా డ్రైవింగ్ సీట్లో కూర్చోవాలని చెప్పారు. ప్రధానంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాలికమల్లవరంలో ఉపాధి హామీ గ్రామసభ



గొలుగొండ : సాలికమల్లవరం రామాలయం వద్ద బుధవారం ఉపాధి హామీ పథకం పై గ్రామసభ నిర్వహించారు. దీనిలో భాగంగా డిఆర్‌పి సుబ్బారావు గత మూడు రోజుల నుంచి పాగచెట్లపాలెం, వెంకటాపురం, సాలికమల్లవరం గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ఏ విధమైన ఫిర్యాదులు రాలేదని, పనులన్ని సక్రమంగా జరిగినట్లు పనులు గ్రామసభలో తెలిపారు.

అలాగే గ్రామంలో హౌసింగ్, పెన్షన్లు వంటి కార్యక్రమాలన్ని చదివి వినిపించగా అన్ని సక్రమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, సాలికమల్లవరం కార్యదర్శి స్వామి, హౌసింగ్ ఎఇ, ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత



నాతవరం : నాతవరం మండలంలో వైయస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సిడి పిఒ కె.శాంతిప్రియ బుధవారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2 కేజీ గోధుమపిండి, అరకేజి రాగి పిండి, అరకేజి బెల్లం, అరకేజి పప్పు చెక్కీలు అందించా మన్నారు. మండలంలో ఉన్న 86 సెంటర్లలోనూ ప్రతీ బుధవారం పాలు, గుడ్లు, టిహెచ్‌ఆర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంను ఈ నెల 9న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ప్రారంభించారన్నారు. అనంతరం వైయస్సార్ సంపూర్ణ పోషణ ప్రాముఖ్యత తెలియజేసి ఆహారంలో ఏ విధంగా తీసుకోవాలో వివరించారు. తదనంతరం సిడిపిఒ మహిళ సంరక్షణ కార్యదర్శులతో సమావేశమై ఐసిడిఎస్ శాఖ విధులను తెలియజేసి సచివాలయ పరిధిలో అన్ని గ్రామాల్లో ఐసిడిఎస్ పథకాలపై, దిశ చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించి అందరికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కరక అప్పలరాజు, నాతవరం మండల సూపర్‌వైజర్లు విజయకుమారి, రామలక్ష్మి, రాఘవ, బిపిఎ కిరణ్, మహిళా సంరక్షణ కార్యదర్శి సునీత, అంగన్వాడీ కార్యకర్తలు సత్యవతి, అప్పలనర్స పాల్గొన్నారు.

### వుయ్ కేర్ యు సంస్థకు
## టివి, గ్యాస్ స్టౌవ్ పంపిణీ


భీమునిపట్నం : వుయ్ కేర్ యు సంస్థ, హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో ప్రారంభించిన దయ గల గోడ కార్యక్రమంలో భాగంగా భీమిలి ఎస్.వి.ఎల్.ఎన్.ఎస్ డిగ్రీ కళాశాల లో ఇంగ్లీష్ లెక్చరర్ గా పనిచేస్తున్న జి.నాగలక్ష్మమ్మ టి.వి, గ్యాస్ స్టౌవ్ అంద జేశారు. ఈ సందర్భంగా వుయ్ కేర్ యు సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సహృదయంతో టివి,గ్యాస్ స్టౌవ్ సంస్థ కు అందజేసినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సామానులు డిసిఆర్ సేవారథం ద్వారా విజయనగరం, రామవరం ప్రేమ వెలుగు అనాధా శ్రమం పిల్లలకు అందించినట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా మణికంఠ స్వీట్స్ హోంపుడ్స్ అందించారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాను,రాంబాబు పాల్గొన్నారు.

## ఎన్నెన్నార్‌కు అరుదైన అవకాశం



విశాఖ సిటీః సుదీర్ఘ అనుభవ పాత్రికేయుడు, రచయిత, సాహస క్రీడాకారుడు నాగనబోయిన నాగేశ్వరరావు (ఎన్.ఎన్.ఆర్)కు అరుదైన అవకాశం లభించింది. తెలంగాణలోని డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎం.సి.ఆర్.ఐ.హెచ్.ఆర్)లో ఐఏఎస్, ఐపీఎస్, ఐఐఏఎస్ అధికారులకు ఇచ్చే ఆలిండియా సర్వీస్, సెంట్రల్ కస్టమ్స్ సర్వీస్ (ఏఐఎస్ అండ్ సీసీఎస్) 95వ ఫౌండేషన్ కోర్సు ముంగిపు కార్యక్రమానికి ప్రత్యేక పరిశీలకునిగా ఆహ్వానం వచ్చింది. ఈ మేరకు అడ్వంచర్ క్లబ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏసీఏపీ), అడ్వంచర్ క్లబ్ ఆఫ్ తెలంగాణ (ఏసీటీఎస్) వ్యవస్థాపకులు కె.రంగారావు ఆహ్వాన పత్రాన్ని పంపించారు. ఫిబ్రవరి అయిదవ తేదీన డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి ఇనిస్టిట్యూట్‌లో అడ్వంచర్ క్లబ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అడ్వంచర్ క్లబ్ ఆఫ్ తెలంగాణా ప్రతినిధులు నిర్వహించే సాహస విన్యాసాలను యువ ఐఏఎస్, ఐపీఎస్, ఐఐఏఎస్ అధికారులతో కలసి నాగేశ్వరరావు తిలకిస్తారు. అదే విధంగా ఈ సాహస కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకునిగా బాధ్యతలు నిర్వహిస్తారు. సివిల్ సర్వీస్ యువ అధికారుల ఫౌండేషన్ కోర్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉందని నాగేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన రంగారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ




అక్కయ్యపాలెం : అనారోగ్యంతో బాధ పడుతు ముఖ్యమంత్రి సహాయనిది కోసం దరఖాస్తు పెట్టుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహయనిది నుండి 31 మంది బాధితులకు 14 లక్షల 30 వేలు విలువైన చెక్కులు మంజూరు కు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు కృషి చేశారు. ఈ చెక్కులను బాధిత కుటుంబాలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సాగి దుర్గా ప్రసాద్ ముఖ్య అతిధిలుగా పాల్గొని బాధిత కుటుంబాలను చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె కె రాజు తో పాటు వైకాపా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## రాజధాని మార్పుపై దుష్ప్రచారం చేయిస్తున్నారు

దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. జీఎన్ రావు కమిటీ నివేదికను చెత్త బుట్టలో పడేయాలని చెప్పిన చంద్రబాబుకు, ఆయన ఎల్లోమీడియాకు ఇప్పుడు అది భగవద్గీతగా మారిందని విమర్శించారు. ఏ అంశంపై కూడా చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రతి విషయంలో చంద్రబాబు యూటర్న్ తీసుకుంటారని, అందుకే ఆయనను యూటర్న్ బాబు అంటారని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల, ప్రాంతాల శ్రేయస్సు కోసమే వికేంద్రీకరణ బిల్లును తీసుకువచ్చామని చెప్పారు. అన్ని కమిటీల నివేదికలను హైపవర్ కమిటీలో చర్చించాకే వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నామన్నారు. శాసన మండలి రద్దుకు రాజధానికి సంబంధం లేదన్నారు. ప్రభుత్వం మీద మాట్లాడడానికి ఏమి లేకపోవడంతోనే రాజధాని అంశంపై వివాదం చేస్తున్నారని ఆరోపించారు.

## రాష్ట్ర భవిష్యత్తు కోసమే మండలి రద్దు నిర్ణయం

సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తుకు గొడ్డలి పెట్టులా టీడీపీ ఎమ్మెల్సీలు వ్యవహరించారని విమర్శించారు. టీడీపీ కుట్రపూరితంగానే మండలిలో బిల్లులను అడ్డుకుందన్నారు.

ఆ ఆదాయం ఏపీ నుంచే అధికం..

మెరైన్ ఎక్స్‌పోర్ట్ వల్ల విదేశీ మారక ద్రవ్య ఆదాయం ఏపీ నుంచే అధికమని మంత్రి తెలిపారు. తీర ప్రాంతంలోని ప్రతి జిల్లాకు ఒక పోర్ట్ నిర్మించే యోచనలో సీఎం వైఎస్ జగన్ ఉన్నారని అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిజాంపట్నం, మచిలీపట్నం పోర్టులను విస్తృత పరుస్తామని చెప్పారు. అందులో భాగంగా సెకండ్ ఫేస్‌లో ఫిషింగ్ జట్టీలు ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీకాకుళం, విశాఖపట్టణం, ప్రకాశం జిల్లాలో ఫిషింగ్ జట్టీలు నిర్మించనున్నట్టు వెల్లడించారు. రూ. 100 కోట్లతో విశాఖలో ఫిషింగ్ హార్బర్ విస్తరణ పనులు చేపడతామన్నారు.

## ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌కు విశాఖ బెస్ట్

చెప్పామని, సముద్ర తీరంలో పెట్టమని చెప్పలేదని జీఎన్ రావు స్పష్టం చేశారు. విశాఖ రాజధానికి అనుకూలం కాదని.. జీఎన్‌రావు కమిటీ పేర్కొందన్న విషయాన్ని.. ఆధారాలతో సహా వివరించడం జరిగింది. విశాఖకు తుఫాన్ల ముప్పు ఉందని, వాతావరణం అనుకూలం కాదని.. సముద్రతీరం ప్రమాదకరమని జీఎన్‌రావు కమిటీ అంశాల వారీగా చెప్పింది. తాము చెప్పిన అంశాలకు కట్టుబడి ఉన్నామని.. విశాఖ తీరంలో కీలక విభాగాలు పెట్టాలని చెప్పలేదన్న జీఎన్‌రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జీఎన్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ విశాఖ రాజధానికి అనుకూలం కాదు.. అనడం కాదని, విశాఖ, మచిలీపట్నం, విజయవాడ లాంటి పట్టణాల్లో.. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయో చెప్పామన్నారు. దురదృష్టవశాత్తు కొందరు కావాలనే.. తమ వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారని అన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న వాళ్లంతా రిపోర్టు తయారుచేశారని జీఎన్‌రావు చెప్పారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జోన్-1గా ఉండాలని చెప్పామన్నారు. విశాఖలో హుద్‌హుద్‌లాంటి తుఫాన్ వచ్చింది కదా అంటే.. శ్రీకాకుళంలో కూడా తుఫాన్ వచ్చిందని జీఎన్‌రావు అన్నారు. ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌కు విశాఖ బెస్ట్ ఆప్షన్ అని చెప్పామని, 3 ప్రాంతాల్లో మూడు రాజధానులు పెట్టాలని ప్రభుత్వానికి చెప్పామని జీఎన్‌రావు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ బలమైన పార్టీగా పుంజుకుంటుంది

రఘువీరారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఇరువురు నేతలకు అభినందనలు తెలిపారు. ఈ ఇద్దరు నేతల సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తులసిరెడ్డి ఎంతో అనుభవం ఉన్న నాయకుడు అని అన్నారు. దళితులు కాంగ్రెస్‌కు ఎంత ముఖ్యమో.. దళితులకు కాంగ్రెస్ కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. రెడ్లు, ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమైన సామాజికవర్గం అని అన్నారు. పంజాబ్‌లో మాదిరిగానే మళ్లీ ఏపీలో కాంగ్రెస్ బలమైన పార్టీగా అవతరిస్తుందన్నారు.

## ఉగాది నాటికి 25 లక్షల ఇళ్ల స్థలాలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పేర్ని నాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉగాది నాటికి 25 లక్షల ఇళ్ల స్థలాల మంజూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఆయన అధికారులకు తెలిపారు. రూ.400 కోట్లతో కొల్లేరు నదిపై మూడు చోట్ల రెగ్యులేటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేస్తామని పేర్ని నాని తెలిపారు.

## శాసన మండలి రద్దుపై రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తాం


ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచనల మాత్రమే చేస్తుందని, ఆ సూచనలపై అంతిమ నిర్ణయం పార్లమెంటు తీసుకుంటుందని తెలిపారు. మండలి రద్దు విషయంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసే ఆలోచన కేంద్రానికి లేదని ఆయన తేల్చి చెప్పారు.

## పెట్టుబడులకు విశాఖ అనుకూలం



సిరిపురం: పెట్టుబడులకు, వాణిజ్య వ్యాపారాలకు విశాఖపట్నం ఎంతో అనుకూలమైనదని విఎంఆర్డిఏ చైర్ పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం విఎంఆర్డిఏ కార్యాలయంలో యు.ఎస్. కాన్సులేట్ ట్రేడ్ అండ్ కామర్స్ ప్రతినిధులు మనోజ్ దేశాయ్, కమర్షియల్ స్పెషలిస్ట్ థియాడర్ ఇమ్మన్యుయాల్, పొలిటికల్ అండ్ ఎకనామిక్ స్పెషలిస్ట్ సిబా ప్రసాద త్రిపాఠిలు ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస రావును కలిశారు. విశాఖ పట్నంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల వివరాలు, ఐ.టి, పెట్టుబడులకు గల అవకాశాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై ఆరా తీశారు. విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా మారనున్నదని, భోగాపురం ఇంటర్నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్, మెట్రో రైల్ వంటి పెద్ద ప్రాజెక్టులు రాబోతున్నాయని ఛైర్మన్ వివరించారు. విఎంఆర్డిఏ శ్రీకాకుళం, విజయనగరం , విశాఖపట్నం 3 జిల్లాల్లో సుమారు 6 వేల 500 చ.కి.మీల విస్తీర్ణంలో ఉందని, విఎంఆర్డిఏ ద్వారా మాస్టర్ ప్లాన్ ఫర్ 2041కు తయారు చేస్తున్నామని మార్చ్‌లో డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరుగుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రాజెక్టులైన ప్లానిటోరియమ్ , నేచురల్ హిస్టరి పార్క్, బీచ్ రోడ్ లో ఇంటెగ్రటెడ్ మ్యూజియం తో పాటు మాస్టర్ ప్లాన్ రహదారులు, కన్వెన్షన్ సెంటర్లకు ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారని, ఈ పనులు వేగంగా పూర్తి చేయడం జరుగుతోందని వివరించారు. యు.ఎస్. కాన్సులేట్ ప్రతినిధి మనోజ్ దేశాయ్ మాట్లాడుతూ విశాఖపట్నం సంస్కృతి, భౌగోళిక అంశాలు, వాతావరణం, మౌలిక వసతులు, సహజ సౌందర్యాలు ఆకట్టుకున్నాయని, పెట్టుబడులకు సుముఖంగా ఉన్నామని తెలిపారు. అనేక మంది భారతీయులు యు.ఎస్. లో పెద్ద పెద్ద కంపెనీలు నడుపుతున్నారని, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలతో రెండు దేశాలు పరస్పరం లాభ పడతాయని అన్నారు.

### కిషన్ రెడ్డికి మత్స్యకారుల సమస్య వివరిస్తున్న విశాఖ యంపీ ఎంవీవీ



విశాఖపట్నం : చేపలవేట కోసం వెళ్లి బంగ్లాదేశ్ సముద్ర జలాల్లో చిక్కుకుని బందీలుగా ఉండిపోయిన ఎనిమిది మంది ఏపీ మత్స్యకారులు విడుదలయ్యారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చొరవతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన మత్స్యకారులను బంగ్లాదేశ్‌లో విడుదల చేయబడ్డారు. సెప్టెంబర్ 27న బోటులో చేపలవేటకు వెళ్లిన వీరంతా పొరపాటున బంగ్లాదేశ్ భూభాగంలోకి ప్రవేశించారు. అక్టోబర్ 2న ఆ దేశ కోస్ట్‌గార్డ్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా తమ దేశంలోకి చొరబడ్డారంటూ వారిపై కేసులు నమోదు చేసి జైళ్లలో బంధించారు. దీంతో మత్స్యకారులను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని విశాఖ ఎంపీ పలుమార్లు కేంద్రాన్ని కోరారు. ఈ క్రమంలో విదేశాంగ శాఖ స్పందించింది. ఉపాధి కోసం వెళ్లిన మత్స్యకారులను విడిచిపెట్టాలని పలుమార్లు బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో వారిని విడుదల చేస్తున్నట్లు బంగ్లాదేశ్ అధికారులు ప్రకటించారు.

## విశాఖ జిల్లాలో ల్యాండ్ పూలింగ్‌కు సిపిఎం వ్యతిరేకం




విశాఖ సిటీః విశాఖలో ల్యాండ్ పూలింగ్ పేరుతో బడుగు, బలహీనవర్గ పేదలు సాగుచేసుకుంటున్న భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం జిఒ.నెం.72ను జారీ చేసింది. ఈ ల్యాండ్ పూలింగ్ విధానాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నరసింగరావు పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం బాటలోనే వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ విధానాన్ని అమలుచేయడం సరైనదికాదని విమర్శించారు. ల్యాండ్ పూలింగ్ కోసం విడుదల చేసిన జిఒ నెం.72ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.


ఇళ్ళస్థలాల పేరుతో పేదలు సాగుచేసుకుంటున్న భూముల జోలికి పోవద్దని జిఓ 294 స్పష్టంగా చెప్తున్నా అందుకు భిన్నంగా జిఓ 72 ద్వారా ల్యాండ్ పూలింగ్‌కు సిద్ధపడుతోంది వైకాపా ప్రభుత్వమన్నారు.

సాగుదారులంతా ఐక్యమై తమ భూములను పరిరక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు ల్యాండ్‌పూలింగ్‌ను వ్యతిరేకించి ప్రభుత్వం తలపెట్టిన గ్రామసభలను అడ్డుకోవాలని సిపిఎం విజ్ఞప్తి చేస్తోందని జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, గ్రేటర్ విశాఖ నగర కార్యదర్శి బి.గంగారావు పేర్కొన్నారు.

## చైనా లో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించండి

***విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వినతి***

***ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కి లేఖ***



విశాఖపట్నం : చైనా లో ఉహాన్ నగరం లో చిక్కుకున్న ఆప్టో డిస్ప్లే టెక్నాలజీ ప్రైవేట్ కంపెనీ కి చెందిన 58 మంది భారతీయులను తిరిగి వెనక్కు రప్పించాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జై శంకర్ ను విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు.ఈ మేరకు ఓ లేఖను అక్కడికి పంపారు.అందులో ప్రముఖంగా ప్రస్తావిస్తూ ,చైనా ఆప్టో ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ ట్రైనింగ్ లో భాగంగా గత ఏడాది ఆగష్టు 23 తేదీన 58 మంది భారతీయులు ఉహాన్ సిటీ కి చేరుకున్నారన్నారు.ఈ క్రమంలో నోవెల్ కరోనా వైరస్ ముప్పు ఆ నగరానికి తాకుతోందన్న హెచ్చరికల నేపథ్యంలో,వారు స్వదేశానికి తిరుగుముఖం పట్టే ప్రయత్నం లో ఉండగా ,ఈ లోపే ఆ ప్రభుత్వం తీవ్ర నిబంధలు ప్రకటిస్తూ ,ఉత్తర్వులు జారీచేసిందన్నారు. సదరు కంపెనీ వారిని స్వస్థలాలకు చేరుద్దామని ప్రయత్నించినా ,అక్కడ ప్రభుత్వం ఒప్పు కోలేదన్నారు.అయితే వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారిని భారతదేశానికి రప్పించాలని అభ్యర్థించారు.

## సచివాలయం ప్రజలకు ప్రభుత్వానికి వారధి

**సంయుక్త కలెక్టర్ ఎల్. శివ శంకర్**



భీమునిపట్నం : గ్రామ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేయాలని సంయుక్త కలెక్టర్ శివ శంకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన భీమునిపట్నం మండలం కె. నగర పాలెం పంచాయితీ నగరపాలెం గ్రామ సచివాలయం ని ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది, వాలంటీర్లు నిబద్ధతతో పనిచేయాలని, తమ పరిధిలో ఉన్న ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. అర్హులను గుర్తించడం, వారికి లభించే పథకాలను గూర్చి మౌఖికంగా చర్చించాలన్నారు. వారి సమస్యలను పై అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలని ఆదేశించారు. సచివాలయంలో వివిధ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రదర్శించాలని, లబ్ధిదారుల వివరాలను కూడా ప్రదర్శించాలని చెప్పారు. హాజరు పట్టీని, వారు నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేశారు. సచివాలయాలను ఎందుకు ఏర్పాటు చేసిందీ వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు తగిన సమాచారాన్ని ప్రదర్శించడమే కాకుండా వాలంటీర్ల ద్వారా అందరికీ తెలియ పరచాలి అన్నారు. వివిధ శాఖలకు చెందిన సిబ్బందికి వారు చేయవలసిన పనులను గూర్చి విశదీకరించారు. ఈ కార్యక్రమంలో భీమునిపట్నం మండల అభివృద్ధి అధికారి పి.వెంకటరమణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అసమర్థుడిని వారసుడిగా చేసేందుకే ఘోరాలు

అమరావతి: అసమర్థుడైన కుమారుడు లోకేశ్‌ను పార్టీకి వారసుడిని చేసేందుకు టీడీపీ నేత చంద్రబాబు అనేక ఘోరాలకు పాల్పడ్డాడని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీని చేజిక్కించుకోవడం కోసం ఎన్టీఆర్ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసిన దుర్మార్గుడని, ఒక వైపు రక్తం పంచుకొని పుట్టిన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడుని, మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావును వాడుకొని వదిలేసిన నీచ చరిత్ర బాబుదని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకులు దివంగత మహానేత వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్‌పై చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. వైఎస్ విజయమ్మ తన ఇంట్లో జరిగిన వ్యవహారాన్ని మాజీ సీఎం రోశయ్యకు చెప్పిందని ఓ కట్టుకథ అల్లి అవాకులు చెవాకులు పేలడం బాబు దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. అడ్డగోలు పత్రికలు, చానళ్లు ఉన్నాయని నోటికొచ్చినట్లు బాబు మాట్లాడుతున్నారన్నారు. నీచ రాజకీయాలకు పేటెంట్ హక్కున్న బాబుకు దివంగత వైఎస్సార్, వైఎస్ జగన్‌ల గురించి మాట్లాడే అర్హతలేదన్నారు.

## ఆచార్యుల నియామకంలో సహాయ సహకారాలు అందించాలి

- ఏయూను సందర్శించిన అమోండ్ వర్సిటీ ప్రతినిధులు
- వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య క్రిష్ణమోహన్‌తో చర్చలు



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సోమాలిలాండ్‌కు చెందిన అమోండ్ యూనివర్సిటీ ప్రతినిధులు బుధవారం ఉదయం సందర్శించారు.

ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావులతో సమావేశమయ్యారు.

అమోండ్ యూనివర్సిటీ అకడిక్ అఫైర్స్ విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ ముసి జిబ్రిల్, సయీద్ హసన్ హబానీ, డాక్టర్ హెూడన్ సులైనాన్ అహ్మద్ లు వర్సిటీ అధికారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఏయూతో పరస్పర సహకారం అందించే అంశాలపై చర్చించారు. తమ విశ్వవిద్యాలయంలో ఆచార్యుల నియామకంలో ఏయూ సహకారం అందించాలి అమోండ్ యూనివర్సిటీ ప్రతినిధులు కోరారు. గురువారం వీరు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశం కానున్నారు. ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకునే అంశాలపై వీరు వీసీతో చర్చిస్తారు.

## పౌరసత్వం సవరణ పైన అవగాహన కార్యక్రమం



మధురవాడ : మహా విశాఖ అయిదవ వార్డు వాంభే కోలనీలో బుధవారం వార్డు బిజెపి అధ్యక్షుడు గండికోట పవన్ కుమార్ ఆద్వర్యంలో దేశ పౌరసత్వం సవరణ చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈకార్యక్రమానికి ముఖ్య అథిదిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

కోలనీలో గడప గడపకి వెళ్ళి దేశ పౌరసత్వం పై వివరించారు, అనంతరం 88662 88662 ఈ నంబరు కు చరవాని ద్వారా మిస్సుడు కాల్ చేసి భారత ప్రదాని మోదీ ప్రవేశ పెట్టిన బిల్లు కు ఆమోదం తెలపాలని కోరారు, ఈకార్యక్రమానికి నగర మైనారిటీ మోర్చా నాయకుడు టి ప్రదీప్ కుమార్, నగర ఎస్ సి మోర్చా నాయకుడు ఎండ అప్పారావు, ఉపాధ్యక్షుడు దుర్గాసి రాము,ఎం భాస్కర్, బి వి ఎన్ పాత్రో,

కార్యదర్శి సిహెచ్ నాగరాజు, కె వి ఎస్ ఎస్ ప్రసాద్, సీనియర్ నాయకుడు గండికోట వెంకట బ్రహ్మాజీ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రోజైన్ వేడుకలు

- సాంకేతికతను దుర్వినియోగం చేయరాదు
- ముఖ్య అతిధిగా డా. జి. పద్మావతి




గోపాలపట్నంః బుధవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల గోపాలపట్నం లో ఎలక్ట్రోజైన్ - 2020 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమునిపట్నం పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డావ జి. పద్మావతి ముఖ్య అతిధిగా విచ్చేసారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీ మోహన్ రావు ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశాఖలో గల పలు కళాశాలలనుండి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిధి డా జి. పద్మావతి మాట్లాడుతూ... పూర్వకాలంతో పోల్చితే నేటి కాలంలో సాంకేతికత బాగా అభివృద్ధి చెందిందని, విద్యార్థులు సాంకేతికత మోజులో పడి పుస్తక పఠనంపై అశ్రద్ధ వహిస్తున్నారని, సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీ మోహన్ రావు మాట్లాడుతూ... ఆదిత్య కళాశాల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ విద్యతో పాటుగా పలు ఉద్యోగ శిక్షణా అంశాలలో తర్ఫీదు ఇస్తుందని కనుక ప్రతీ విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకొని భవిష్యత్తులో ఉత్తమ ఉద్యోగాలు పొందడానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎలకానిక్స్ ప్రొజెక్ట్స్, పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, క్విజ్ మొ అంశాలపై పోటీలను నిర్వహించి కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీ మోహన్ రావు చేతుల మీదుగా బహుమతి ప్రధానం గావించారు. ఎలక్ట్రానిక్స్ సాంకేతికతను ఉపయోగించి విశాఖను స్మార్ట్ సిటీగా మలిచే నేపధ్యంతో వికలాంగులు మెట్లు ఎక్కకుండా రైలు ఎక్కడానికి వీలుగా తయారుచేసిన ఎలివేటర్ సిస్టమ్ అతిధులను ఆకర్షించింది.

ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కె. శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ డి.వి.వి. ఫణికుమార్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 800 మంది కళాకారులతో అన్నమాచార్యకు నృత్యనీరాజనం

**గోడ పత్రికలు విడుదల చేసిన మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్**



విశాఖపట్నం : అన్నమయ్య వర్ధంతి సందర్భంగా తిరుపతిలో అన్నమయ్య కీర్తనతో అన్నమయ్య నృత్యనీరాజనం కార్యక్రమం శ్రీ సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 800 కళాకారులు తిరుపతిలో మొట్టమొదటి సారిగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కొరకు జరిగే ఈ కార్యక్రమం గోడ పత్రికలను బుధవారం ఉదయం పర్యాటక శాఖ మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాస రావు (అవంతి) సీతమ్మదార క్యాంపు కార్యలయం వద్ద విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమం తిరుపతి నగరంలో 20-మార్చ్-2020 వ తేదీన జరుగును. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షులు డా.పి.శరత్ చంద్ర, ధరనీదక్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఫీజులు రద్దు చేయాలి

**భారత కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి**

ఆంధ్ర విశ్వకళాపరిషత్ః ఆంధ్రాయూనివర్శిటీ యాజమాన్యం ఇటీవల భారీగా పరీక్షా ఫీజులు పెంచారు. ఈ పెంచిన ఫీజులు విద్యార్థులు భరించలేనివి. పేద విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికే విద్యార్థులు తీవ్ర ఆంధోళన చేస్తున్నారు.

తక్షణమే పెంచిన పరీక్షా ఫీజులు రద్దు చేయాలని భారతకమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విశాఖ నగర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.

ఏడాదికి పరీక్షా ఫీజు 2050 నుండి 2850 పెంచటం అన్యాయం.

ఆంధ్రాయూనివర్సీటీలో చదువుకునే విద్యార్థులు 90 శాతం పేద కుటుంబాల నుండి వచ్చినవారు. తెల్లరేషన్ కార్డు కుటుంబాలకు చెందినవారు. కనుక మీరు పెంచిన ఫీజు విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగిస్తుంది. కనుక తక్షణమే పెంచిన ఫీజులు రద్దుచేయాలని సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేస్తున్నది.

## ప్రశాంతంగా ల్యాండ్ పూలింగ్



మధురవాడ : పేదలందరికీ ఇల్లు అందుకు అనుగుణంగా రైతుల వద్ద నుంచి సేకరించిన స్థలాలపై రెవెన్యూ అధికారులు అభ్యంతరాలు సేకరించారు, మహా విశాఖ నాలుగో వార్డు పరిధి కొమ్మాది గ్రామంలో గల అమరావతి నగర్ కళ్యాణ మండపంలో విశాఖ ఆర్టీవో పి కిషోర్, రూరల్ తాసిల్దార్ ఆర్ నరసింహ మూర్తి ఆధ్వర్యంలో అభ్యంతరాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్ డి ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నవరత్నాలు లో భాగంగా ఉగాది నాటికి పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేదలందరికీ 48 గజాల ఇల్లు స్థలం ఇవ్వనునామని అందులో భాగంగానే కొమ్మాది, పరదేశి పాలెం గ్రామాల్లో సుమారు 90 ఎకరాల స్థలం సేకరించామని, ఎకరా స్థలం ఉన్న వారికి వి ఎం ఆర్ డి ఎ ఆధ్వర్యంలో 900 గజాల స్థలం ఇవ్వనున్నామని, అలాగే పదేళ్లపాటు ఆక్రమణలో ఉన్న వారి కోసం 500 గజాలు ఐదేళ్ల పాటు ఉన్న వారికోసం 250 గజాల స్థలాలు ఇస్తామని వీటిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్న తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమం లో అందరూ భాగస్వాములై ప్రభుత్వంతో సహకరించాలని కోరారు.

## సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం : శివ సాయి సాంస్కృతిక సినీ సంగీత సంస్థ ఆధ్వర్యంలో మూడు గంటల నిర్విరామ సినీ సంగీత విభావరి గోడ పత్రికను బుధవారం సిఎంఆర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్ మూర్తి, సంస్థ అధ్యక్షులు జిఎ గోపాల్ రావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (సిఐడి) ఎస్ ఎస్ ఎన్ రాజు ఈ ఆవిష్కరణ లో పాల్గొన్నారు. నగరానికి చెందిన ఫిబ్రవరి 2వ తేదీన కళాభారతి ఆడిటోరియంలో సాయంత్రం 6 గంటల నుంచి ఈ సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. నగరానికి చెందిన ప్రముఖ గాయనీ గాయకులు బంగార్రాజు, మహమ్మద్ ఖాన్, సూర్యకుమారి, శ్రీదేవి, గుణశ్రీ, జాస్మిన్, ఆశా మధు, ఉమా ప్రియా తదితరులు వివిధ పాత కొత్త పాటలను ఆలపించను న్నారని అధ్యక్షులు శివ సాయి గోపాల్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే నని సంగీత ప్రియులు అంతా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సన్ మూర్తి పిలుపునిచ్చారు.

## గీతం విద్యార్థులకు జాతీయ ఆర్కిటెక్చర్ అవార్డులు

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటెట్ ఎస్సెస్‌మెంట్ సంస్థ నిర్వహించిన ఉత్తమ సిద్ధాంత గ్రంథ పోటీలో అవార్డులు లభించాయి. సుస్థిర అభివృద్ధిలో ఆర్కిటెక్చర్ అనే అంశంపై ఎమ్ఆర్క్ విద్యార్థులు విశాఖ నగరంలోని వివిధ ప్రాంగణాలపై ఆర్కిటెక్చర్ వ్యాసాలను జాతీయ స్థాయి పోటీలలో సమర్పించారు. ఎమ్ఆర్క్ విద్యార్థిని వి.రమ్య గీతిక 'విశాఖలోని హవామహల్' పై సమర్పించిన సిద్ధాంత వ్యాసం జాతీయ స్థాయిలో ప్రధమ స్థానంలో అవార్డుతో పాటు రూ. 75 వేల రుపాయల నగదుబహుమతిని అందుకుంది. మరో విద్యార్థిని వి.షణ్ముక తేజ సమర్పించిన 'రైతు బజార్‌ల డిజైనింగ్ సిద్ధాంత వ్యాసం' ద్వితీయ స్థానంలో అవార్డును అందుకుందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరక్టర్ ప్రొఫెసర్ కె.మోహన్ తెలిపారు.

ఇటీవల ముంబయి లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఈ అవార్డులు అందుకున్నారని వెల్లడించారు.

కాగా విద్యార్థుల ప్రతిభను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ అభినందించారు.

# విజయభాను


## సంపాదకీయం

### విషతుల్యం

మనిషి ఆరోగ్యం కోసం, మనుగడ కోసం ఆహారం తీసుకుంటాడు. ఆ తీసుకునే ఆహారమే విషతుల్యమైతే.. ఆరోగ్యమే కాదు, మనుగడకే ముప్పు ఏర్పడుతున్నది. పుష్టిగా ఎదుగటం కోసం, ఆరోగ్యకరమైన జీవనం కోసం తీసుకుంట్నున ఆహార పదార్థాలే విషతుల్యమైతే ఆరోగ్యం అటకెక్కి, చావుకు దగ్గరవుతారు. సరిగ్గా ఇప్పుడు దేశంలో ఇదే జరుగుతున్నదని మిలీనియం సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఫౌండేషన్ (ఎస్డీజీఎస్), థాట్ ఆర్బిటేజ్ అనే అధ్యయన సంస్థలు చెబుతున్నాయి. భారత్‌లో ఆహారం, నీటి కాలుష్యంతో పడే ఆర్థిక భారం పేరుతో విడుదల చేసిన నివేదికలో మనం రోజూ తీసుకునే ఆహారం, తాగే నీరుతోనే ఎక్కువ రోగాలు వస్తున్నాయని తమ అధ్యయనంలో తేల్చిచెప్పాయి. గ్రామీణ ప్రాంతాలు మొదలు, నగరాల దాకా ప్రజల ఆహార అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగానే రోగాలు వస్తున్నాయని తెలుపటం గమనార్హం. మరోవైపు తాగునీరు హానికరమైన పదార్థాలతో కలుషితమైపోవటం కారణంగా మరింత ఎక్కువగా వ్యాధులు వస్తున్నాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ కారణంగా ప్రజలు ఆరోగ్యం కోసం పెడుతున్న ఖర్చు నానాటికీ పెరిగిపోతున్నది. ఎస్డీజీఎస్ అధ్యయనం ప్రకారం కలుషిత ఆహారంతో వచ్చిన జబ్బులు నయం చేసుకోవటానికి 2016-17 సంవత్సరంలో సుమారు 33 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తేలింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2022 నాటికి 9.50 లక్షల కోట్ల రూపాయలు దవాఖానలకే పెట్టాల్సి వస్తుందని హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామ గ్రామానికి రక్షిత మంచినీరు అందించే కార్యక్రమం ప్రజారోగ్యానికి ఎంతో ఊతమిచ్చేదే. ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించటంతో పాటు ఆహారకల్తీని అరికట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. వంటలకు ఉపయోగించే నూనెలతో పాటు, పసుపు, అల్లం. పప్పు, కారం, ఉప్పు లాంటి అత్యవసర పదార్థాల కల్తీని నిరోధించాలి. ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో కదిలి ఆహార కల్తీని అరికట్టాలి. మొత్తంగా చూస్తే మనిషి సాధిస్తున్న ఆధునికాభివృద్ధి మూలంగా మరింతగా సమస్యల విష వలయంలో చిక్కుకుపోతున్నాడు. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో ఆధునికాభివృద్ధి, జీవన విధానమే అంతులేని సమస్యలను తెచ్చిపెడుతున్నది. ఆహార పంటల దిగుబడి కోసం, కూరగాయలు,ఆకుకూరల పంటలను చీడపీడల నుంచి సం రక్షించుకునేందుకు రైతులు విచక్షణారహితంగా రసాయనాలను వినియోగిస్తున్నారు. ఈ క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులతో ఉత్పత్తి అవుతున్న ఆహార పదార్థాలన్నీ కలుషి తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రధాన నగరా ల్లో వినియోగిస్తున్న కూరగాయలను పరిశీలించినప్పు డు అంతర్గతంగా కూరగాయాల్లో, వాటిపైన కూడా ప్రమాదకర స్థాయిలో హానికరమైన రసాయనాల అవశేషాలున్నట్లు జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ (ఎన్ఐపీహెచ్ఎం) తెలిపింది. మార్కెట్లో దొరుకుతున్న 15 రకాల కూరగాయలపై హానికరమైన రసాయనాలున్నట్లు గుర్తించారు. ఇలాంటి విషతుల్యమైన ఆహార పదార్థాలను తీసుకోవటం వల్ల మనిషి ఆరోగ్యం పుంజుకునే బదులు మరింతగా కృషించిపోతున్నది. అనేకరకాల చర్మవ్యాధులు, శ్వాస సంబంధ వ్యాధులతోపాటు ప్రాణాంతకమైన క్యాన్సర్ లాంటి రోగాలు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితి గ్రామాలతో పోలిస్తే నగరాల్లోనే తీవ్రంగా ఉంటున్నది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సమీప ప్రాంతాల్లో కాలుష్య జలాలను పంటల సాగుకు వినియోగించటం కూడా ప్రధాన సమస్యగా మారుతున్నది. మరోవైపు ఆహారాన్ని ఉత్పత్తి చేసే సంస్థలు కనీస నిబంధనలు, పరిశుభ్రతను పాటించకపోవటం ప్రధాన సమస్యగా ఉంటున్నది. విశాలభారత దేశంలో గుర్తింపు పొందిన ఆహార ఉత్పత్తి సంస్థలు 39 వేల పైచిలుకు మాత్రమే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అనధికారికంగా ఏ ప్రమాణాలు పాటించని ఆహారోత్పత్తి సంస్థలు 23 లక్షలకు పైచిలుకు ఉన్నాయి. మరోవైపు అక్రమ లాభార్జనకు కల్తీ ఆహార పదార్థాలను తయారుచేయటం పెద్దఎత్తున సాగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లోంచే ఇవ్వాళ ప్రతి ముగ్గురిలో ఒకరు వ్యాధిగ్రస్తుడై ఉంటున్నాడు. దేశంలో ఇప్పటికీ రక్షిత మంచినీరుకు నోచుకోని ప్రజలు కోట్లాదిగా ఉన్నారు. దీనికితోడు భూగర్భ జలాల్లో ఫ్లోరిన్, ఆర్సెనిక్ లాంటివి మోతాదుకు మించి ఉండటం మూలంగా కూడా ప్రజలు రోగాలబారిన పడుతున్న స్థితి ఉన్నది.

## అమరవీరుల స్మారక దినోత్సవం (జనవరి 30)

### మహాత్మా గాంధీ వర్ధంతి



మోహన్ దాస్ కరంచంద్ గాంధీ.. భారత జాతీయ కాంగ్రెస్ తరుపున నాయకత్వం వహించి స్వాతంత్ర్య పోరాటం చేశారు. భారత దేశ చరిత్రలో 1948 జనవరి 30 ఎంతో విషాద దినం. ఆ రోజు మహాత్మునిగా ప్రజల హృదయాలలో కొలువైన మహాత్మా గాంధీ కన్నుమూశారు. ఆ రోజు అయన దిన చర్యను గమనిస్తే ఎన్నో ముఖ్య విషయాలున్నాయి. భారతదేశ స్వాతంత్ర్యానికి ముఖ్య సంస్థ గా నిలిచిన భారత జాతీయ కాంగ్రెస్ అవసరం స్వాతంత్ర్యం సిద్ధించడంతో అయిపోయిందని గాంధీజీ భావించారు. కాంగ్రెస్ ను రద్దుచేసి దాని స్థానంలో 'లోక్ సేవక్ సంఘ్' పేరున స్వచ్ఛంద సంస్థ ప్రారంభించాలని ప్రణాళిక ఆ రోజు ఉదయం తయారైంది. ఆ రోజు ఉదయం మార్గరెట్ బర్కేవైట్ అనే ఒక అమెరికన్ మహిళా ఫోటోగ్రాఫర్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ లో అటం బాంబునైనా అహింస తోనే ఎదురించాలని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ఢిల్లీ లోని బిర్లా మందిర ప్రార్థన ప్రదేశానికి బయలుదేరి వచ్చారు. సుమారు 5 వందల మంది ఉన్న ఆ గుంపులో నుండి నాథూరాం గాడ్సే అనే వ్యక్తి ఎదురుగా వచ్చి ఆటోమేటిక్ పిస్టల్‌తో మూడు సార్లు కాల్పులు జరిపాడు. హే రాం అంటూ గాంధీజీ కుప్పకూలారు. డాక్టర్లు పరీక్షించి గాంధీజీ మరణించారని నిర్దారించారు. జీవితమంతా శాంతి అహింస లు బోధించి, ఆచరించిన గాంధీజీ చివరకు హింసకు బలయ్యారు. ఈ హత్య కేసు విచారణకు ఒక ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయబడింది. ఆత్మ చరణ్ అగ్రవాల్ అనే ఐ పి ఎస్ అధికారి న్యాయవాదిగా నియమించబడ్డారు. గాడ్సే తో కలిసి తొమ్మిది మంది అరెస్ట్ చేయబడ్డారు. వీరిలో దిగంబర రామచంద్ర బడ్గే అనే ముద్దాయి ప్రభుత్వం తరుపున సాక్షిగా మారాడు. ఈ కేసు విచారణ ఎర్ర కోటలో జరిగింది. 30 డిసెంబర్ 1948 నాటికి విచారణ పూర్తయింది. ఫిబ్రవరి 10, 1949 న తీర్పు ఇవ్వబడింది. వీర సావర్కర్ నిర్దోషిగా నిర్ణయింపడినాడు. నిందితులకు వ్యతిరేకంగా సాక్షమిచ్చి నందుకు గాను బాగ్డే కు క్షమాభిక్ష పెట్టీ విడుదల చేశారు. విష్ణు కర్కేరే, మధన్ లాలా పాహ్వా, గోపాల్ గాడ్సే, శంకర కిష్టయ్య, డా. సర్చురే లకు యావజ్జీవ ద్వీపాంతరవాసం శిక్ష వేయబడింది. నాథూరాం గాడ్సే, నారాయణ ఆప్టే లకు ఉరి శిక్ష విధింపబడినది. గాంధీజీ వర్ధంతి రోజైన జనవరి 30 వ తేదీన అమరవీరుల స్మారక దినంగా పాటిస్తారు. గాంధీ గుజరాత్ రాష్ట్రంలోని పోర్ బందర్‌లో అక్టోబర్ 2, 1869 న జన్మించారు. వీరి తల్లిదండ్రులు పుతలీబాయి, కరంచంద్ గాంధీ. 13వ ఏట కస్తూరీ బాయితో గాంధీ వివాహం జరిగింది. డర్బన్ నగరం సమీపంలో ఫీనిక్స్ ఆశ్రమం నిర్మించి ఇండియన్ ఒపీనియన్ అనే పత్రికను నడిపారు. 1906 లో సత్యాగ్రహ ఉద్యమం ప్రారంభించారు. 1915 లో స్వదేశానికి తిరిగి వచ్చి సబర్మతి వద్ద ఆశ్రమాన్ని నెలకొల్పారు. 1921 లో సహాయ నిరాకరణ, సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, 1930 లో ఉప్పు సత్యాగ్రహం, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి స్వాతంత్ర్యం సిద్ధించే వరకు నిర్విరామంగా పోరాడారు.

## భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక




అన్నవరం : .తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక సాయిబాబా గుడి దగ్గర ఉన్న ఒంటరి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బహిరంగ వేదిక వద్ద భారీ సంఖ్యలో టీడీపీ నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివ ృద్ధి పనులు,రాష్ట అభివ ృద్ధి కొరకై మూడు రాజధానులు నిర్మాణానికి ఆయన చేస్తున్న క ృషి చూసి అదేవిధంగా ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివ ృద్ధికి ఆకర్షితులై అన్నవరం టీడీపీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ వీర్ల.సూరిబాబు మరియు శంఖవరం మండలం మాజీ ఉపాధ్యక్షుడు బొమ్మిడి.సత్యనారాయణ ఆధ్వ ర్యంలో సుమారు 300 మంది తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్,కాకినాడ పార్లమెంటు సభ్యులు శ్రీమతి వంగా.గీతా విశ్వనాథ్ గార్ల ఆధ్వర్యంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకున్నారు. వీరందరినీ డీసీసీబీ డైరెక్టర్ శెట్టిబత్తుల.కుమార్ రాజా సాదరంగా ఆహ్వానించి ఎమ్మెల్యే పర్వత చే పార్టీ కండువా వేయిం చారు. ఈ సందర్భంగా వీర్ల.సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివ ృద్ధికి చేస్తున్న కృషి, మరియు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.ప్రసాద్ నియోజకవర్గంకు చేస్తున్న క ృషికి ఆకర్షితులై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు.పార్టీ తీర్థం తీసుకొన్న వారిలో టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు పలివెల. సతీష్,పడాల. సత్యనారాయణ, వీర్ల.చక్రరావు,వీర్ల.రాంబాబు,వీర్ల.మణికంఠ,స్థానిక ఆర్.ఎం.పి.వైద్యుడు పదిలం.బెన్నబాబు,కర్రి.చిన్న, సోము. సురేష్,దాసరి.శంకర్,దాసరి.శ్రీనివాస్,గండిమేని.ఆదినారాయణ టీడీపీ కార్యకర్తలు వైసీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వీర్ల.సూరిబాబు, బొమ్మిడి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే.పుర్ణచంద్ర ప్రసాద్, ఎంపి.వంగా.గీతా విశ్వనాద్ లను గజ మాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు రాయవరపు. భాస్కరరావు, కొండపల్లి.అప్పారావు,ఆశిన.శ్రీనివాస్,ధారా.వెంకటరమణ,గణేశుల.బాబ్జి, అల్లాడ. సూరయ్యదొర, అల్లాడ.సూరిబాబు, బొబ్బిలి.వెంకన్న,బండారు.అర్జునరావు,తాటిపాక.క ృష్ణ, కొల్లు.చిన్న,కొల్లు.గణేష్,కొత్త.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బాబాను దర్శించిన యోగులు



శ్రీ కాక భుశుండి అవధూత

భగవాన్ బాబా పదకొండు మంది సాధకులను ఎంపిక చేసి, వారికి ప్రత్యేకమైన ఆశీస్సులతో పాటు, వారికి నిత్యము ఆహారం సమకూర్చే ఒక అక్షయపాత్రను ప్రసాదించి, హిమాల యాలలో బదరీనాథ్‌కు 25 మైళ్ళ దూరంలో వాయవ్యదిశలో నరనారా యణ పర్వతం మీద ఊర్వశీకుండ్ సమీపంలో ఒక నివాసయోగ్యమైన గుహలో తాపస జీవితం గడపమని పంపారు. భగవాన్ బాబా అప్పుడప్పుడు ఆ గుహ ఆశ్రమంలో ప్రత్యక్షమై వారికి సాధనలో వచ్చిన సంశయాలను నివృత్తి చేస్తూ ఉన్నారు. సుమారు ఐదు వందలు లేక వేయి సంవత్సరాల ఆయుష్షు కలిగిన మహా సిద్ధపురుషులు అప్పుడప్పుడు ఈ నరనారాయణ గుహా శ్రమానికి వచ్చి వారితో బాబా గురించి సంభాషించి, అక్షయపాత్రలో బాబా సృష్టించిన ప్రసాదం స్వీకరించి వెళు తుండేవారు. అటువంటి సిద్ధపురుష లలో 1. కాక భుశుండి అవధూత 2. మరొక వేదాంత పరివ్రాజక సిద్ధ పురుషు డు 3. మహావతారబాబా 4. బాబా సుందరదాస్ 5. దేవరియా బాబా 6. భృగుబాబా వంటి వారు కొందరు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్యత్వం గుర్తించిన మహానుభావులు. కాక భుశుండి అవధూత అనేది వీరి పేరు కాదు. ఈ సిద్ధ పురుషుడు హిమా లయాలలో కాక భుశుండి పర్వతం మీద నివసిస్తున్నారని నరనారాయణ గుహలోని మన ఆశ్రమవాసులు వారిని అలా భావన చేశారు. వీరు మొదటిసారి నరనారాయణ గుహకు వచ్చినప్పుడు ఆశ్రమవాసులు 'అయ్యా! శివావతా రమైన శ్రీ సత్యసాయినాథ భగవానుని గురించి మీ అభిప్రాయం తెలుసుకో నవచ్చునా?' అని అడిగారు. అప్పుడు ఆయన భగవద్గీత విభూతియోగంలోని శ్లోకం చెప్పి కృష్ణుడు అర్జునునితో 'అర్జునా! నా అవతార రహస్యమును దేవతలు ఎఱుగరు. ఋషులూ ఎఱు గరు. కారణమేమంటే దేవతలు మరియు మహర్షులకు నేను కారణ భూతుడను. ఆదికర్తను!' అన్నాడు. ఇలా చెప్తూ ఆ అవధూత 'దివ్యస్థితి కలిగి, మంత్ర సాక్షాత్కారము చేసుకునే మహర్షులు కూడా అవతారతత్వాన్ని గుర్తించలేనప్పుడు నావంటి సాధారణ మైన వ్యక్తి వారిని ఎలా తెలుసుకోగ లగుతాడు?'' అని పలికారు. అవతారమూర్తి మమ్మల్ని దగ్గరకు రానీయటం లేదు. ఇటువంటి స్థితిలో వారి ఆశీర్వాదం లభించటం మాకు అసాధ్యంగా ఉందన్నారు. -- **సశేషం..**

## తొలగిన ఇంజనీరింగ్ కళాశాల అడ్డంకులు

### అతి త్వరలోనే పనులు ప్రారంభం



యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలోని గిరియాం పేటలో సుమారు 17 ఎకరాలో కేంద్ర ప్రభుత్వ ఆదీనంలో గల ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుకు సంబంధించి అన్ని అడ్డంకులు తొలగి అనుమతులు వచ్చాయని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారతదేశ వ్యాప్తంగా 8 ఇంజనీరింగ్ కళాశాలలకు అనుమతి జారీ చేయగా వాటిలో ఒక ఇంజనీరింగ్ కళాశాలను యానాం నియోజకవర్గానికి కేటాయించిన విషయం తెలిసిందే. ఇటీవలే దేశ ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీ నుండి శంఖుస్థాపన చేశారు. అయితే గత 8 నెలల నుండి పుదుచ్చేరిలో రాజకీయ కారాణలతో అనేక అడ్డంకులు చోటుచేసుకోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అయితే ఇటీవల యానాం నుండి 1300 వందల మంది విద్యార్థులు ఈ ఇంజీరింగ్ కళాశాలకు సంబందించి భారత రాష్ట్రపతి రామనాద్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదికి వినతులు పంపడంతో స్పందించిన వారు తక్షణం పుదుచ్చేరి అధికారులకు అదేశాలు జారీ చేయ్యడంతో తక్షణం అనుమతులు విడుదల చేశారు. దీంతో కళాశాల నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చినట్లైయిందని త్వరలో పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాటు చేస్తునట్లు చెప్పారు. ముఖ్యంగా విద్యార్థుల వినతులకు స్పందించిన భారత రాష్ట్రపతి రామనాధ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోది, విద్యార్థులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి కేంద్రం తొలివిడతగా రూ.7 కోట 80 లక్షల నిధులు విడుదల చేసింది.

నూతనంగా ఎక్కడా లేని విధంగా నూతనంగా పెట్రోకెమికల్, బయోకెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్, పార్మాసూటికల్, సిరామిక్స్ వంటి అధునాతన 5 కోర్సులను ఈ కళాశాలలో ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క కోర్సులో 30 మంది చొప్పు న ఏడాదికి 150 మంది శిక్షణ పొందే చర్యలు తీసుకు కొంటామన్నారు. అదే విధంగా టెక్నికల్ స్టాఫ్ 30 మంది, నాన్ టెక్నికల్ 35 మంది, ఇతర్రతా సిబ్బంది మొత్తం సుమారు 80 మందికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## ప్రాణాయామము అంటే..



కొంత మంది ప్రాణాయామము ద్వారా మనోనిశ్చలతకు ప్రయత్నం చెస్తూ వుంటారు. ఇలా చెయడం ద్వారా మనో నిశ్చలతను కొంత వరకు సాధించవచ్చు. శ్వాసని గమనించడం ద్వారా మనస్సుకు ఎందుకు నిశ్చలత వస్తుంది అంటే శ్వాశ (ప్రాణము) మరియు మనస్సు (ఆలోచన) పుట్టు చోటు ఒక్కటే (ఆత్మే) ఇది ఎలాగంటే రెండెడ్లబండిని నియంత్రించే వ్యక్తి ఏ ఎద్దును నిలుపుటకు ప్రయత్నించినా రెండవ ఎద్దు కూడా తాత్కాలికంగా నిలుస్తుంది.

అయితే మనకు కావలసినది తాత్కాలిక నిశ్చలత కాదు. మనకు కావలసినది మనో నాశనమే. శ్వాసని నిలిపితే కేవలం మనస్సు లయమవుతుంది (గాఢ నిద్రలో లాగా). ఎంత దీర్ఘకాలం ప్రాణాయామము చేసిన తాత్కాలిక మనోనిశ్చలమే సిద్ధిస్తుంది. అది కూడా ఎంత సేపు చేస్తే అంత సేపే నిలుస్తుంది. లయించిన మనస్సు మరల పుడుతుంది. కాని మనం మనోలయంతో త ృప్తి పడరాదు.

దేవికాలోత్తరంలో కూడ ప్రణయామం కాని, కుంభకం కానీ, శ్వాసమీద ధ్యాస కానీ, మంత్ర జపం కాని ఇలాంటివి జ్ఞానమార్గంలో (ఆత్మ విచార మార్గంలో) ఉండేవారికి పనికి రాదని పరమశివుడు చెప్పివున్నడు. మనది గమ్యం మనో నాశనము. మనసంటే తలపుల సమాహారమే కదా. అన్ని తలపులకు మూలం నేను అన్న తలపే కాబట్టి, నేను అన్న తలపే (అహం) మనస్సు.

మనస్సును (నేను అన్న తలుపును) నేను ఎవరిని? అను ఆత్మ విచారము ద్వారా నాశనం చేయవచ్చు. అప్పుడు నేను అన్న తలంపు నశించిపోయి "నేను" (ఆత్మ) అన్న అత్మానుభూతి కలుగుతుంది. శాశ్వతంగా నిలుస్తుంది. దీనికి కావలసిన శిక్షణ గురు ముఖతః నెర్చుకోవాల్సిందే.

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి

## ఫ్యాప్సియా తోడ్పాటునందిస్తుంది

అమరావతి : ఫెడరేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసి యేషన్స్ (ఫ్యాప్సియా) 1986 నుండి రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి మరియు సంక్షేమానికి తోడ్పడుతూ ఉంది.

ఫ్యాప్సియా సమాఖ్య చిన్న పరిశ్రమల రంగం తరఫున పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కమిటీలలో సభ్యత్వంతో ప్రాతినిధ్యం కలిగి ఉన్నది.

ఫ్యాప్సియా పరిశ్రమల ఉత్పత్తుల మార్కెటింగ్ మరియు అమ్మకాల అభివృద్ధికై మార్చి 6, 7, 8వ తేదీలలో విజయవాడ, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు లో గల సిద్దార్థ ఇన్స్టిట్యూట్ అఫ్ హోటల్ మానేజ్మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ గ్రౌండ్స్ నందు ఎం.ఎస్.ఎం.ఈ. మెగా ఎక్స్పో 2020 ని నిర్వహించనుంది.

ఈ ఎక్స్పో లో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎం.ఎస్.ఎం.ఈ. ల ఉత్పత్తులు, యంత్రములు, ప్యాకేజింగ్, ఆధునీకరణ మొదలైన ఎన్నో ఉపయుక్తమైనవి ప్రదర్శిం చడంతో పాటుగా రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడే వివిధ అంశాలపై పరిశ్రమకు చెందిన నిపుణులతో చర్చాగోష్టి మరియు వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులతో తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుంది.

ప్రముఖ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటాయి.

ఎం.ఎస్.ఎం.ఈ. రంగానికి చెందిన వారికి ఎన్.ఎస్.ఐ.సి. వారిచే ఉత్పత్తుల ప్రదర్శనకు మద్దతు కూడా లభిస్తుంది.

ఈ ప్రదర్శనలో పాల్గొని ఎం.ఎస్.ఎం.ఈ. వారి సహాయ సహకారాలను పొందగోరు వారు 04 ఫిబ్రవరి 2020 తేదీ లోపు తమ ధరఖాస్తులను అందజేయవలసి ఉంటుంది.

వివరములకు... వాసిరెడ్డి మురళీ, అధ్యక్షుడు (సెల్:7382333233), ఫణి, కార్యదర్శి (సెల్:9966169901), సతీష్, సంబంధిత అధికారి (సెల్:9666003337) ని సంప్రదించవచ్చును.




**CHANGE OF NAME**

**I, MOHAMMAD ATHAHAR (Old name) S/o. MOHAMAD MAZHAR KHAN, R/O.D.No-36-92-242/36/1, Srinivas nagar, Kailasapuram, Visakhapatnam. Changing my name from MOHAMMAD ATHAHAR (Old name) to MOHAMAD ATHAHAR ALI KHAN (NEW NAME), henceforth I am being called as MOHAMAD ATHAHAR ALI KHAN (NEW NAME) for all purposes.**

**CHANGE OF NAME**

**I, TEKU ESWAR RAO (Old name) S/o.TEKU NAGAYYA, R/O.D.No-8-8-37/B, Ravada veedhi, Tuni, East godavari. Changing my name from TEKU ESWARRAO (Old name) to TEKU ESWARA RAO (NEW NAME), hence forth I am being called as TEKU ESWARA RAO (NEW NAME) for all purposes.**

## పగిలిపోయిన పైప్‌లైన్‌కు మరమ్మత్తులు

కోటవురట్ల : ఎట్టకేలకు ఇందేశమ్మవాక వద్ద వరహానదిలో పగిలి పోయిన పైపులైన్‌కు తాత్కాలిక మరమ్మత్తులు చేశారు. అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు వరహానది ఉధృతంగా ప్రవహించడంతో పైలెట్ ప్రాజెక్టు నుంచి ఇతర మండలాలకు సరఫరా అయ్యే పైపులైను పగిలిపోయిన విషయం తెలిసిందే. దీంతో సుమారు మూడు నెలలుగా నియోజకవర్గంలోని నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన 33 గ్రామాలకు నీటి సరఫరా నిలిచి పోయింది. అప్పట్లో నదిలో నీరు అధికంగా ఉండటం వల్ల మరమ్మత్తులకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం కొంచెం తగ్గడంతో పనులు చేపట్టారు. నదిలో శాశ్వత పనులు చేసేందుకు ఊటనీరు అడ్డుగా వస్తుండటంతో తాత్కాలికంగా పనులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్దరించామని చెప్పారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### పాఠశాల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని
#### ఆరోపణలు ఎదుర్కొంటున్న జూనియర్ అసిస్టెంట్ సర్వేశ్వరరావు సస్పెండ్

అనంతగిరి : గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల 2 లో బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జూనియర్ అసిస్టెంట్ సర్వేశ్వరరావు ని సస్పెండ్ చేస్తూ పాడేరు డిడి విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారని ఏటి డబ్ల్యు ఓ సూర్యనారాయణ తెలిపారు. లైంగిక దాడి ఆరోపణలు తోపాటు అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడంపై ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో సంఘటనపై దర్యాప్తు ముమ్మరం చేస్తున్నామన్నారు.

### సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తూ.గో.జిల్లా జగ్గంపేట గ్రామానికి చెందిన కరుటూరి మనోజ్ కుమార్ రూ.1,00,000/- విరాళమును దేవస్థానం ఏఈవో ప్రసాద్ కు అందజేసి అన్నదానం జరిపిం చవలసినదిగా కోరారు.

### ఈనెల 31న
## అడవిరాజులబాబు పండుగ


అడవి రాజులబాబులు

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల, పాకలపాడు, కొత్తూరు, గుండుపాల, పోలవరం, ఎర్రవరం, జోగుంపేట, యరకంపేట, కొత్తఎల్లవరం, పప్పుశెట్టిపాలెం తదితర గ్రామాల్లో ఈ నెల 31న అడవి రాజులబాబు పండుగ జరపనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు ప్రారంభించారు. భారీ ఎత్తున విద్యుద్దీపాలకరణ చేపడుతున్నారు. చీడిగుమ్మలలో శుక్రవారం ఉదయం భారీ ఊరేగింపుతో సంబరాలు ప్రారంభించి ఎర్రవరం గ్రామంలో ఉన్న రాజులబాబు గుడికి భక్తులు చేరుకుంటారు. అక్కడ విశేష పూజలు నిర్వహించనున్నారు.

## నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలోని శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో ఈ నెల 30న సామూహిక అక్షరాభ్యాసాలు, అక్షర పూజలు, సరస్వతి హోమాలను నిర్వహించ నున్నారు. వీటిలో విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

## నేడు సిఏఏ బిల్లు రద్దు కోరుతూ ర్యాలీ

విశాఖ : రాజ్యాంగ విరుద్ధమైన ఎన్ఆర్సీలను వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలంటూ ఈనెల 30వ తేదీన కొమ్మాది జంక్షన్ నుంచి ఎండాడ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మధురవాడ మైనారిటీస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఎండి ఉద్దీన్ పేర్కొన్నారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన ఎన్‌పిఆర్, సిఏఏ విధానాన్ని రద్దు చేయకపోతే ఎంతోమంది మంది ప్రజలు నష్టపోతారన్నారు. భారత దేశ ప్రజలకు వారసత్వంగా ఆస్తులు తదితర అంశాలు ఎక్కడినుంచి వచ్చాయంటే చాలా వరకు వివరాలు లభ్యం కాని పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు.

కాబట్టి కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా నిర్వహిస్తున్న ఈ బిల్లును రద్దు చేయాలని ఆయన కోరారు. దేశంలోని ప్రజలందరూ ఈ ర్యాలీకి అనుగుణంగా తమ ప్రాంతాలలో నిరసనలు తెలియజేసి యంపీఆర్, సిఏఏ బిల్లులను రద్దు చేసే వరకు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విలేఖర్ల సమావేశంలో కమిటీ కో- చైర్మన్ డాక్టర్. అనిల్ పాల్, డైరెక్టర్ ప్రేమ్ పాల్గొన్నారు.

## మకరజ్యోతి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం

నర్సీపట్నం : నర్సీపట్నం శ్రీస్వామి అయ్యప్ప దేవాలయం వద్ద మకరజ్యోతి ఉత్సవాలలో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఆలయ ధర్మకర్త చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరై అన్నప్రసాదాన్ని స్వీయంగా భక్తులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సుమారు 3వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

## రామన్నపాలెంలో ఇళ్ల సమస్య పరిష్కారం


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

నాతవరం : సరుగుడు పంచాయతీ రామన్నపాలెంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి, గ్రామపెద్దలతో కలిసి సామరస్యంగా ఇళ్లు సమస్యను పరిష్కరించారు. గత మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో 40 సెంట్లు ప్రభుత్వ భూమి ఇళ్ల కొరకు కేటాయించారు. అప్పటి నుండి 16 మంది నిరుపేద గిరిజనులు కమ్మల ఇళ్లు కట్టుకొని జీవిస్తున్నారు. వారిలో వారికి మనస్పర్థలు వచ్చి తగువులు రావడంతో ఆర్ఐ, వీఆర్వో దృష్టికి తీసుకువెళ్లి గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి సమక్షంలో సమస్య పరిష్కారం జరిగింది. ఇప్పుడు నివాసం ఉంటున్న 16 మంది లబ్ధిదారులకు వారి ఉన్న చోటనే స్థలాన్ని వారికి ఇవ్వడానికి అందరి ఏకాభిప్రాయంతో సమస్య పరిష్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్.లక్ష్మణమూర్తి, పి.రాజుబాబు, మాజీ ఎంపిటిసి పత్తి శ్రీను, బిజెపి మండల అధ్యక్షులు లాలం వెంకటరమణారావు, ఎల్.విక్రమ్, జనసేన మండల అధ్యక్షులు జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రత్యేక శిబిరం



విశాఖపట్నం : 1వ వార్డు పరిధిలోని పైనాపిల్ కోలనీ చిన్నగదిలి మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. సేవా శిబిరం బుధవారంతో ముగిసింది. వారం రోజుల పాటు ఇక్కడ అనేక సేవా కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు, పైనాపిల్ కోలనీ గ్రామస్తులకు వైద్య శిబిరం, ఆరోగ్య సమస్యలు మరియు నవరత్నాలు వంటి పలు అంశాలపై ర్యాలీలు నిర్వహించారు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేసారు. ఈ సందర్భంగా విశాఖ తూర్పు నియోజక వర్గ వై.ఎస్.అర్.సి.పి. సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల ముఖ్య అతిధిగా పాల్గొని ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లను అభినందించారు. మానవ సేవే మాధవ సేవ అని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం మంచి ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల గురించి ప్రజలలో అవగాహన కల్పించినందుకు అభినందనలు తెలిపారు. వివిధ పోటీలలో పాల్గొన్న వాలంటీర్లు మరియు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, ఎకాడమిక్ కో ఆర్డినేటర్ కె. వెంకటేష్, ఎన్.ఎస్.ఎస్. పి.ఒ. డా.ఎస్. శ్రీనివాసరావు, పైనాపిల్ కోలనీ ప్రెసిడెంట్ కె. సుబ్బరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, వార్డు ప్రెసిడెంట్ కె. సత్యనారాయణ, వెల్ఫేర్ సెక్రటరీ డా. సి.హెచ్. సీతారాం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు బి.రామలక్ష్మి, కె. సాయి క్రిష్ణ, వార్డు సచివాలయం వాలంటీర్లు మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

## ఘనంగా గౌరీశ్వరస్వామి మహా శివరాత్రి కళ్యాణరాట మహోత్సవం


కళ్యాణ రాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు

చోడవరం : పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి కళ్యాణ రాట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిధ్యాల నడుమ ఉత్సవ ప్రోత్సాహకులు పి.జయదేవ్, ఉత్సవ ఛైర్మన్ గూనూరు సత్య నారాయణ చేతుల మీదుగా కళ్యాణ రాట వేశారు.

కార్యనిర్వహణాధికారి ఎన్.ఎల్.ఎన్.శాస్త్రీ, వైసిపీ టౌన్ అధ్యక్షులు పుల్లేటి వెంకటరావు, కాంగ్రేగుల డేవిడ్, వాణీ ప్రెస్ బాబు, శిల్పి జి.చిన్న, అర్చకులు దవళ ప్రసాద్,సకలా సూరిబాబు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పరవాడలో రాజయోగ మెడిటేషన్ కేంద్రం ప్రారంభం





పరవాడ : ప్రజాపిత బ్రహ్మకూమారీస్ (పరవాడ) ఆధ్వర్యంలో రాజయోగ మేడిటేషన్ కేంద్రాన్ని స్థానిక గ్రామీణ బ్యాంక్ ఎదురుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా గ్రామ పెద్దలు పైల పోతినాయుడు (పెద్దింటి), బ్రహ్మకుమారి బి.కె.సత్యవతి చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరము సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి టెన్షన్, మానశిక ఒత్తిడి నుండి విముక్తి, మనస్సు ఏకాగ్రత కోసము ఉచితముగా రాజ యోగం నేర్పిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ బి.కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

**IN THE HONOURABLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**I.A.707/2018 in O.S.298/2012**

**Between:**
**Visakhapatnam Urban Development Authority, rep. by its Secretary, Sri Adapala Srinivasu ...Petitioner**
**And**
**Sri Patharlagadda Ranga Rao (DIED) & others ...Respondents /proposed defendants 2 to 5**

**NOTICE**

**To**
**R2) Smt.Patharlagadda Jaya Sree, w/o.late Ranga Rao, aged 48 years, Household duties, residing at Flat No.A10, Villa Royal apartments, Siripuram, Visakhapatnam.**
**R3) Sri Patharlagadda Rama Krishna, s/o.late Ranga Rao, aged 34 years,Business, residing at Flat No.A10, Villa Royal apartments, Siripuram,Visakhapatnam.**
**R4) Sri Patharlagadda Soma Sekhar, s/o.late Ranga Rao, aged 32 years,Business, residing at Flat No.A10, Villa Royal apartments, Siripuram, Visakhapatnam.**
**R5) Sri Patharlagadda Bhaskara Durga Chakravarthi, s/o.late Ranga Rao, aged 29 years, working as Asst.Administrative Officer, Gitam University, residing at D.No.50-53-2/2, Sai Ganapathi Nilayam, B.S.Layout, Visakhapatnam-3**

The petitioner has filed the above I.A. in the above suit for the reliefs mentioned therein. Whereas it is found to the satisfaction of Honourable Court that you all have been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you all by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you all are hereby directed to appear before the **Honourable Court**, on **04-02-2020 at 10.30 A.M** either in person or through an Advocate failing which the hearing will take place in your absence.

**Tatavarthy Law Chambers (TLC)**
**T.V.S.K. KANAKA RAJU**
**M.A.S.PRABHA**
**Advocates**
**Visakhapatnam.**
**Ph: 0891-2755164**

**IN THE HONOURABLE COURT OF XII ADDL.DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**O.S.577/2018**

**Between:**
**M/s.Potluri Constructions, a partnership firm, rep. by its Managing Partner Mr.Potluri Pavan Kumar ...Plaintiff**
**And: Sri Pulipati Venkateswara Reddy & others ...Defendants**

**NOTICE**

**To**
**D9**)Sri Marada Srinivasa Reddy, S/o.Sri Marada Apparao, aged about 40 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**D11**)Sri Ravi Chowdary, S/o.father's name not known to the petitioner, aged about 49 years, Crecent Towers, Seethammadhara, Visakhapatnam.
**D14**)Smt.Marada Appayamma, W/o.Husband's name not known to the petitioner, aged about 50 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**D17**)Smt.Marada Polamma, w/o.late Marada Polipilli, aged about 59 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17
**D18)** Smt.Marada Polamma, w/o.Husband's name not known to the petitioner, aged about 34 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**D21**) Sri Marada Govindamma, w/o.Husband's name not known to the petitioner, aged about 30 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.

Whereas the above plaintiff has filed the above suit against you all and others for the reliefs mentioned therein. Where as it is found to the satisfaction of Honourable Court that you all have been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you all by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you all are hereby directed to appear before the **Honourable Court, Visakhapatnam** on **06-02-2020 at 10.30 A.M** either in person or through an Advocate failing which the matter will be heard and decided in your absence.

**Tatavarthy Law Chambers (TLC)**
**T.V.S.K. KANAKA RAJU**
**M.A.S.PRABHA**
**Advocates**
**VisaKhapatnam.**
**Ph: 0891-2755164.**

**IN THE HONOURABLE COURT OF XII ADDL.DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**I.A. 1240/2018 in O.S.577/2018**

**Between:**
**M/s.Potluri Constructions, a partnership firm, rep. by its Managing Partner Mr.Potluri Pavan Kumar ...Petitioner**
**And: Sri Pulipati Venkateswara Reddy & others ...Respondents**

**NOTICE**

**To**
**R9**)Sri Marada Srinivasa Reddy, S/o.Sri Marada Apparao, aged about 40 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**R11**)Sri Ravi Chowdary, S/o.father's name not known to the petitioner, aged about 49 years, Crecent Towers, Seethammadhara, Visakhapatnam.
**R14**)Smt.Marada Appayamma, W/o.Husband's name not known to the petitioner, aged about 50 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**R17**)Smt.Marada Polamma, w/o.late Marada Polipilli, aged about 59 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17
**R18)** Smt.Marada Polamma, w/o.Husband's name not known to the petitioner, aged about 34 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**R21**) Sri Marada Govindamma, w/o.Husband's name not known to the petitioner, aged about 30 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.

Whereas the above Petitioner has filed the above suit against you all and others for the reliefs mentioned therein. The petitioner has filed the above I.A. also for the reliefs mentioned therein.Where as it is found to the satisfaction of Honourable Court that you all have been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you all by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you all are hereby directed to appear before the **Honourable Court, Visakhapatnam** on **06-02-2020 at 10.30 A.M** either in person or through an Advocate failing which the matter will be heard and decided in your absence.

**Tatavarthy Law Chambers (TLC)**
**T.V.S.K. KANAKA RAJU**
**M.A.S.PRABHA**
**Advocates**
**VisaKhapatnam.**
**Ph: 0891-2755164.**

**IN THE HONOURABLE COURT OF XII ADDL.DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**I.A. 1241/2018 in O.S.577/2018**

**Between:**
**M/s.Potluri Constructions, a partnership firm, rep. by its Managing Partner Mr.Potluri Pavan Kumar ...Petitioner**
**And: Sri Pulipati Venkateswara Reddy & others ...Respondents**

**NOTICE**

**To**
**R9**)Sri Marada Srinivasa Reddy, S/o. Sri Marada Apparao, aged about 40 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**R11**)Sri Ravi Chowdary, S/o.father's name not known to the petitioner, aged about 49 years, Crecent Towers, Seethammadhara, Visakhapatnam.
**R14**)Smt.Marada Appayamma, W/o.Husband's name not known to the petitioner, aged about 50 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**R17**)Smt.Marada Polamma, w/o.late Marada Polipilli, aged about 59 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17
**R18)** Smt.Marada Polamma, w/o.Husband's name not known to the petitioner, aged about 34 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.
**R21**) Sri Marada Govindamma, w/o.Husband's name not known to the petitioner, aged about 30 years, residing at Kagithalavari street, Fishermen Colony, Peda Waltair, Visakhapatnam-17.

Whereas the above Petitioner has filed the above suit against you all and others for the reliefs mentioned therein. The petitioner has filed the above I.A. also for the reliefs mentioned therein.Where as it is found to the satisfaction of Honourable Court that you all have been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you all by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you all are hereby directed to appear before the **Honourable Court, Visakhapatnam** on **06-02-2020 at 10.30 A.M** either in person or through an Advocate failing which the matter will be heard and decided in your absence.

**Tatavarthy Law Chambers (TLC)**
**T.V.S.K. KANAKA RAJU**
**M.A.S.PRABHA**
**Advocates**
**VisaKhapatnam.**
**Ph: 0891-2755164.**

# శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయండి

## ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : చోడవరంలో అతి పురాతన క్షేత్రం స్వయంభూ గౌరీశ్వరస్వామి వారి ఆలయంలో జరగబోయే మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు.

పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం శివోధ్యానవనంలో నూతనంగా నిర్మించిన పంచ ముఖేశ్వరుని విగ్రహంను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం గౌరీశ్వరస్వామి ఆలయం నూతన ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సత్య నారాయణ, సభ్యులు మండా శ్రీరామమూర్తి, అత్తిలి జగన్నాథ రావు, లకుందాసు సూర్య కుమారి, పరిటి సరస్వతి, పాట్నూరి అరుణ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వ హణాధికారి ఎన్.ఎల్.ఎన్.శాస్త్రి, ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కొడమంచిలి చలపతిరావు, ఎమ్మెల్యే సోద రుడు జయదేవ్, పుల్లేటి వెంకటరావు, జ్యోతుల రమేష్, కాండ్రేగుల డేవిడ్, పిన బోయిన అప్పారావు యాదవ్, ఓరుగంటి నెహ్రు, బొడ్డు శ్రీరామ మూర్తి, మారిశెట్టి శ్రీకాంత్, సాగర్, పల్లా నరసింగరావు సూరిశెట్టి నాగదుర్గ గోవింద, అర్చకులు కొడమంచిలి శ్రీనివాస్, సంగీస మహేష్, పురోహితులు దవళ ప్రసాద్, వఝుల సూర్యప్రకాష్‌రావు, భూమిరెడ్డి శ్రీనివాస్, సకలా సూరిబాబు, వై.సీ.పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ సహకారముతో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగింపు



పరవాడ : పరవాడ మండలము వాడచీపురుపల్లి పంచాయితీ పరిదిలో గల పోలిపల్లి జంక్షన్ నుంచి దళాయిపాలెం గ్రామము నకు వెళ్లే రోడ్డు మార్గము నకు ఇరుపక్కలా భారీగా తుప్పలు పేరుకు పోయాయి. వాహనాలు రాకపోకలకు ఆటంకం కలుగుతుంది అని దీనివల్ల ఎక్కువుగా ప్రమా దములు జరిగే అవకాశం ఉంది. ఈ విషయము పై వాడచీపురుపల్లి వైసిపి కన్వీ నర్ బురదరాజు ఎన్టీపిసి సిజిఎమ్ సుదర్శన్ బాబు దృష్టికి తీసుకు వెళ్ళారు. దీనిపై సిజిఎమ్ సుదర్శన్ బాబు స్పందించి ఎన్టీపిసి అదికారులతో మాట్లాడి రోడ్డుకు ఇరు వైపులా గల తుప్పలను తోలిగించారు. రోడ్డుకు ఇరువైపులా గల తుప్పలను తోలిగించడము పట్ల పలువురు హర్షం వ్యక్తము చేశారు. ఈ కార్య క్రమంలో దళాయి రాము, బండి ముత్యాలు, కూంద్రపు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ



భీమునిపట్నం : భీమిలి మండలంలోని తాటితూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల కు డిసిబి ద్వారా తయారు చేసిన స్టడీ మెటీరియాల్ని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిధిగా బి.నాగమణి హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి చదవి పదికి పది గ్రేడ్ తెచ్చుకోవాలని అన్నారు. విశిష్ట అతిధి బి.గోపాలరావు మాష్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచిమార్కులు తెచ్చుకుంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందపడతారని అన్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.మెహ్రా మాటా డుతూ దాతలు ఇచ్చిన మెటీరియల్ ను చదివి మంచిగ్రేడ్ తెచ్చు కోవాలని కోరారు. ఎస్.జిటి ఉపాధ్యాయులు ప్రసాదరావు, దాలయ్యాబాబు ఆర్థిక సహాయం తో ఈమెటీరియల్ చేశారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు టి.ఎస్.వి ప్రసాద రావు, సత్య నారాయణ, మురళీధర్, కిషోర్, అప్పల నాయుడు, శేఖర్, సునీత, సత్యవతి, ప్రభావతి, కామేశ్వరి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# పొలంబడి కార్యక్రమం



భీమునిపట్నం : భీమిలి మండలం టి. నగర పాలెం మరియు తదితర గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా రైతు లందరికీ ఫెర్మాన్ ట్రాప్ పంపిణీ చేశారు తదుపరి భీమిలి వ్యవ సాయ అధికారిని క్రియేట్ సంధ్య రత్నప్రభ మాట్లాడుతూ ఫెర్మాన్ ట్రాప్ ఎకరానికి నాలుగు పెట్టుకోవడం వలన మొక్కజొన్న పంటలో ఆశించే కత్తిరి పురుగు నివారించ వచ్చునని ఆమె చెప్పారు అలాగే ఫెర్మాన్ ట్రాప్ 75 శాతం సబ్సిడీ మీద రైతులకు పంపిణీ చేయడం జరుగు తుందని చెప్పారు ఈ కార్యక్రమంలో మండలంలో సచివాలయాల్లో ఉన్నటువంటి వి ఏ ఎస్ మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.



'సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం'వారు రూపొందించిన నూతన క్యాలెండర్ ను విశాఖ వైసీపీ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఇంఛార్జి మొల్లి రమణబాబు, జిల్లా గౌరవ అధ్యక్షురాలు మెరుగుమాల శ్రీదేవి, గాజువాక ఇంఛార్జి ఈగలపాటి యువశ్రీ, జిల్లా కార్యదర్శి పైడిరాజు, నాయుడు, గంటా అప్పారావు పాల్గొన్నారు.

# ఫీడర్ అంబులెన్స్ ఈఎమ్టీలకు జాబ్ ట్రైనింగ్



అనంతగిరి : ఫీడర్అంబులెన్స్ ఈఎమ్టీలకు జాబ్ ట్రైనింగ్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి జివికె మూడు జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ అమీర్ పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి విజయనగరం జిల్లా అమ్మపాలెం, విశాఖపట్నం జిల్లా టోకురు, అనంతగిరి, జీన బడు, కించుమండ, కాశిపట్నం వాహన సిబ్బందికి అంబులెన్స్ లో అత్య అవసర సేవలు పై విధి నిర్వహణ, మందులు వినియోగము, తీసుకోవ లసిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి ఫీడర్ వాహనం రోజుకు 4 కేసులు చేయాలని ఈఎమ్టీలకు ఆదేశించడం జరిగింది. ఫీడర్ సిబ్బంది సక్రమంగా డ్యూటీ చేయాలేదని, కేసులకు రాలేదని, ఎటువంటి ఫిర్యాదు వచ్చిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్ వైజర్ గంగాధర్ సిబ్బంది సామ్యల్, నవీన్, తిరుపతి రావు, కృపారావు తదితరులు పాల్గొన్నారు.

# లక్కవరం హైస్కూల్‌లో ఉత్సాహంగా ప్రారంభమైన క్రీడలు

## - విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించాలి - ఎంఈవో పి.అచ్చుతరావు




- క్రీడలు ప్రారంభిస్తున్న ఎంఈవో



- కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

చోడవరం : మండలంలోని లక్కవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభ మయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.జె.సుందర్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఎం.ఈ.వో పి.అచ్చుతరావు, చోడవరం సి.ఐ, కరణం ఈశ్వరరావు ముఖ్యఅతిధులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఈవో మాట్లాడుతూ విద్యా ర్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించాలన్నారు. అనంతరం చోడవరం సి.ఐ మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు, మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. జాతి ఐకమత్యానికి, వివిధ ప్రాంతాల మధ్య సత్సంభాంధాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు.

అనంతరం జరిగిన బాలుర వాలీబాల్ పోటీలలో గోవాడ హైస్కూల్ ప్రధమ, పి.ఎస్.పేట ద్వితీయ స్థానాలు, బాలికల విభా గంలో పి.ఎస్.పేట ప్రథమ, జుత్తాడ ద్వితీయ స్థానాలలో విజయం సాధించారు.

కబడ్డీ బాలికల విభాగంలో గౌరీపట్నం ప్రథమ, నర్సాపురం కె.జి.బివి ద్వితీయ స్థానాలు సాధించగా, బాలుర కబడ్డీ గవర్న మెంట్ హైస్కూల్ ప్రధమ స్థానంలో నిలచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్. అప్పలనాయుడు తెలిపారు.

# హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రారంభం



సీతమ్మధార : సీతమ్మ ధారలో గల ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎదురుగా భవనంలో హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు హాజరై ప్రారంభించారు.

# సైకాలజిస్టులతోనే సమాజ ప్రగతి

## నూతన పరిశోధనలపై ముగిసిన మూడు రోజుల సదస్సు సర్టిఫికేట్లు బహూకరించిన యంపి ఎం.వి.వి. సత్యనారాయణ




ఆంధ్ర విశ్వకళాపరిషత్: సైకాలజిస్టుల పరిశోధనలతోనే సమాజ ప్రగతికి అవకాశం కలుగుతుందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.వి.వి.సత్యనారాయణ అన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ సైకాలజీ విభాగంలో మూడు రోజుల పాటు నూతన పరిశోధనల పై నిర్వహించిన సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి విశాఖ ఎం.పి. ఎంవివి సత్యనారాయణ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ సైకాలజిస్టులు దేశ ప్రగతిలో భాగస్వాములు కావడం అత్యంత కీలకమన్నారు. ఎన్నో మానసిక సమ స్యలు పరిష్కారానికి వారు చేస్తున్న పరిశోధనలే బాసటగా నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా అద్యాపకులు, విద్యార్థులను ఎంవివి అభినందించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఏయూ సైకాలజీ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ ఎం.వి.ఆర్. రాజు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మానసిక సమస్యలతో బాదపడే వారి సంఖ్య అధికమైందన్నారు. ఈ సమస్యల వల్ల ఎంతో మంది క్షణికావేశంలో ప్రాణాలు సైతం తీసుకుంటున్నారన్నారు. గతంలో నగర ప్రజలకు సైకోమెట్రిక్ పరీక్షలను అందు బాటు లోకి తెచ్చామన్నారు. ఇప్పుడు అనేక మంది ప్రముఖుల ద్వారా మానసిక సమస్యల పరిష్కారంకై నూతన పరిశోధనల గురించి మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించా మన్నారు. వీటిని ప్రణాళికా బద్దంగా తయారు చేసి ప్రభుత్వాలకు నివేదిస్తామన్నారు. ప్రతీ విద్యాలయం , ప్రభుత్వ కార్యాలయంలో సైకాలజిస్టుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం చట్టం కూడా రూపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా పరిశోధకులకు, సీనియర్ విద్యార్థులకు , వివిధ విభాగాల నుంచి హాజరైన ప్రతినిధులకు ఎం.పి. ఎంవివి, ఆచార్య ఎం.వి.ఆర్.రాజు చేతులు మీదుగా సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణాఫ్రికాకు చెందిన డాక్టర్ ఏలంను, అతిధులను ఘనంగా సత్కరించారు. మూడు రోజుల పాటు విజయవంతంగా జరిగిన సదస్సుకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సీనియర్ విద్యార్థి గంట్ల శ్రీనుబాబు సమన్వయకర్తగా వ్యవహరించారు. సదస్సులో డాక్టర్ సునీత, సుబాసినీ, అంజని, శరవాణి తదితరులంతా పాల్గొన్నారు.

# తెదేపా ర్యాలీకి ఖాకీల బ్రేక్

## -అప్రజాస్వామ్యం మాజీ ఎమ్మెల్యే పల్లా



గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న శాసన మండలి రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గాజు వాక తెదేపా శ్రేణుల ఆధ్వ ర్యంలో బుధవారం నిర్వ హించిన భారీ ర్యాలీని పోలీ సులు అడ్డు కట్ట వేసారు. భారీ సంఖ్యలో గాజువాక తెదేపా కార్యాలయం నుంచి మొదలు పెట్టిన ర్యాలీని పెదగంట్యాడ, న్యూపోర్టు, గాజువాక పోలీసులు అనుమతులు లేవంటూ ర్యాలీలో పాల్గొన వద్దని హెచ్చ రించారు. దీంతో తెదేపా శ్రేణులు ర్యాలీని కొన సాగించడానికి చేసిన ప్రయత్నం విఫలం కావడంతో అక్కడే బైటాయించి రాష్ట్ర ప్రభు త్వంపై, ముఖ్యమంత్రి వైయస్‌జగన్ పై విమ ర్శల బాణాలను సందించారు. ఇదేమి పాలన.... రౌడీల పాలన....తుగ్లక్ పాలన అంటూ నినా దాలు చేస్తూ వైకాపా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుమతులను ముందుగానే తీసుకున్న పోలీసులు ర్యాలీని ఆపడం అప్రజాస్వామ్యమని మండిపడ్డారు. ఇదే పంథా గత తెదేపా ప్రభుత్వం అనుసరించి ఉంటే జగన్ పాదయాత్ర చేసిఉండేవారా? అని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వానికికి చిత్త శుద్ధి లేదని, మూడు రాజధానుల బిల్లును అడ్డు కున్నారనే నెపంతో ఏకంగా శాసన మండలిని రద్దు చేయడం దారుణమని, అవగాహన రాహిత్యమని విమర్శించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అమరావతి రైతులకు న్యాయం చేయా లని, వారు ఉసురుమంటే రాష్ట్రాన్నికి హరిష్టమని హెచ్చరించారు. ఇప్పటికైన అమరాతినే రాజ ధానిగా కొనసాగించాలని, రైతులకు న్యాయం చేయాలని లేని యెడల ఈ పోరాటం మరింత ఉదృతం చేస్తామని అన్నారు.

## మొక్కొన్న విత్నాల సాగులో యాంత్రీక్ణ్

విశాఖపట్నం : ప్రముఖ అగ్రి బిజినెస్ సంస్థ సైంజెంటా వ్యవసాయ రంగంలో కీలక మార్పులక్కు శ్రీకారం చుట్టింది. సరిపడా కార్మికులు అందుబాటులో ఉండోవ్వాన్ని గ్నించింది. రైతులు పడుతున్న క్ష్టాల్ను చూడ్డంతో మొక్కజొన్న విత్తనాల సాగులో యాంత్రీకరణ విధానాన్ని ప్రారంభించింది. వెట్ ఇయర్ హార్వెస్టింగ్, డీహస్కింగ్ పరికరంతో 1.5 గంటలో ఎకరం భూమిలో విత్తనాలు నాటవ్చు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో లోక్స్భ సభ్యులు పీ బ్రహ్మానంద రెడ్డి సారథ్యంలో విత్తనాల సాగు కేంద్రంలో విత్తనాలు నాటే కార్యక్రమానికి సైంజెంటా ప్రారంభించింది.

## ఆదర్శ పాఠశాలలో విద్యాభ్యాసంపై తనికీ
## క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రుత్తల రాజాచంద్ర




నర్సీపట్నం : పెడబొడ్డేపల్లి మండల పరిషత్ ఆదర్శ పాఠశాల ను క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రుత్తల రాజా చంద్ర రోజు వారీ పాఠశాల సందర్శనలో భాగముగా విసిట్ చెయ్యడము జరిగింది. సందర్శనలో ముఖ్యంగా గమనించిన అంశాలు: మార్నింగ్ ప్రార్థన అమలు, ఆనంద వేదిక అమలు, రిమిడియల్ టీచింగ్ బోధన, గణిత మిత్ర కిట్ ద్వారా విద్యార్థులకు బోధించే తీరును గమనించడం జరిగింది.

దీనిలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన గణిత మిత్ర కిట్ ద్వారా విద్యార్థులకు గణితం పై ఉన్న భయాందోళనకు దూరం చేసి కృత్యాలు, బొమ్మల ద్వారా సులభంగా విద్యార్థులకు బోధించే అంశాన్ని గమనించడం జరిగింది.ఈ రోజు బోధించిన పాఠ్య విషయం: టైం అనే పాఠ్యాంశం బోధించడం జరిగింది. తర్వాత వర్చువల్ క్లాస్ రూమ్ ద్వారా విద్యార్థులకు పాఠాల బోధన పరిశీలించడం జరిగినది.

తదుపరి కార్యక్రమం జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ఈరోజు అమలు చేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించడం జరిగినదని తెలిపారు.

## స్టాక్‌మార్కెట్లు లాభాల జోరు

ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు భారీ లాభాలతో కొనసాగుతున్నాయి. గత రెండురోజుల నష్టాలకు చెక్ చెప్పిన సూచీలు ఆరంభంలోనేల లాభాల పట్టాయి.అనంతరం మరింత ఎగిసిన కీలక సూచీ సెన్సెక్స్ 350 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ 105 పాయింట్లు ఎగిసి 12157 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ బ్యాంకు కూడా ఇదే జోరుతో కొనసాగుతోంది. దాదాపుఅన్ని సెక్టార్లు లాభపడుతున్నాయి. ఫలితాల ప్రభావంతా బజాజ్ ఫిన్ సర్వ్ టాప్ విన్నర్‌గా ఉంది. స్టీల్, లార్సెన్, టెక్ మహీంద్ర, హీరో మోటో లాభపడుతుండగా, ఐషర్ మోటార్స్, డా.రెడ్డీస్, టీసీఎస్ అల్ట్రాటెక్ సిమెంట్, టైటన్, భారతి ఎయిర్‌టెల్ నష్టపోతున్నాయి.

## రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా ఇంటరాక్ట్ క్లబ్స్ ప్రమోషన్




విశాఖపట్నం: నగరంలో మూడు వేల మంది బాలలతో రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం మరియు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా 100 ఇంటరాక్ట్ క్లబ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్లబ్బుల యొక్క ఇన్స్టలేషన్ బుధవారం నాలుగు గంటలకు ఉడా చిల్డ్రన్స్ థియేటర్ లో జరిగింది. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ హాజరయ్యారు. రోటరీ మరియు వి.సి.సి కలిసి పనిచేయడం అభినందనీయం, పిల్లల అభివృద్ధికి ఇది బాగా ఉపయోగపడుతుంది అన్నారు. రోటరీ క్లబ్ గవర్నర్ ఎం. వీరభద్ర రావు పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటరాక్ట్ క్లబ్బులు ద్వారా బాలల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, పెంపొందుతాయి అన్నారు. వీరికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వస్తుంది అన్నారు. రోటరీ చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ కృష్ణ కుమార్ మాట్లాడుతూ అనేక కార్యక్రమాలు చేస్తున్నా ఇప్పుడు ఇంత పెద్ద ఎత్తున మూడు వేల మందితో క్లబ్లు ఏర్పాటు చేయడం అనేది హిస్టరీ అన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ టి.వి.గాంధీ మాట్లాడుతూ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు పిల్లలకు ఎంతో మేలు చేకూరుస్తాయి అందుకనే వారితో కలిసి పని చేస్తున్నాము అన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఎం.వి. సత్య కుమారి రోటరీ అందించిన సహకారానికి క్లబ్ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తూ నగరంలో ఉండే పేద మధ్యతరగతి కాలనీలో ఏర్పాటు చేసిన 100 క్లబ్బుల కు రోటరీ లాంటి సంస్థ సహకారం అందించటం అంటే అది పిల్లలలో అభివృద్ధికి ఉపయోగపడుతుంది. తప్పకుండా ఇంటరాక్ట్ లక్ష్యాలకు అనుగుణంగా వి సి సి పనిచేస్తుంది. ప్రతి క్లబ్బును కోఆర్డినేట్ చేయటానికి ఒక వాలంటీర్ని పెట్టడం జరిగింది. వీరంతా కూడా రోటరీ క్లబ్ యొక్క రోటరాక్ట్ లో సభ్యులుగా ఉంటారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ వి.అర.కె.ప్రసాద్,ఎం.శ్రీకాంత్,జాయింట్ సెక్రెటరీ మోదాశీబిక, పాస్ట్ ప్రెసిడెంట్ కృష్ణ కుమార్ మొదలైన వారు పాల్గొన్నారు. నగరంలో మధురవాడ ఆరిలోవ మద్దెలపాలెం జగదాంబ కంచరపాలెం అక్కయ్యపాలెం గోపాలపట్నం పెందుర్తి మల్కాపురం గాజువాక స్టీల్ ప్లాంట్ జోన్ల పరిధిలో ఈ క్లబ్బులను ఏర్పాటు చేయడం జరిగింది. ఇన్స్టలేషన్ సందర్భంగా ప్రతి క్లబ్ ప్రెసిడెంటు మరియు సెక్రెటరీ కి బ్యాడ్జి పెట్టి నాయకత్వ ఇవ్వడం జరిగింది.

## అధికారులు, నాయకులతో అవంతీ సమీక్ష సమావేశం



భీమునిపట్నం: భీమిలి అవంతీ క్యాంపు కార్యాలయంలో మంత్రి ముత్తంశెట్టి.శ్రీనివాసరావు (అవంతీ) భీమిలి నియోజకవర్గ అధికారులు, ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాలు, , జి.వి.ఎం.సి 4,5 వార్డుల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మంత్రి అవంతీ మాట్లాడుతూ ప్రతి పేద వానికి నవరత్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను కోరారు.

అలాగే వైయస్ఆర్ నవశకాలు ద్వారా పేద వానికి అందుతుందో లేదో ప్రతి ఇంటి గడపకి వెళ్ళి అడిగి తెలుసుకోవాలని అన్నారు . అలాగే స్థానిక ఎన్నికలకు నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని స్థానిక సమస్యలపై దృష్టి సాధించాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ కూడా నవరత్నాల పథకాలు అందుతున్నాయో లేదో ప్రతి పెదవాని ఇంటికి వెళ్ళి అడిగి తెలుసుకొని, ప్రతి ఒక్కరికీ కూడా పథకాలు అందేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, జి.వి.ఎం.సి 4,5 వార్డులు, ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిక్కింలో జరిగిన నిక్ క్యాంపులో ఏపీకి రెండు జాతీయ అవార్డులు



గాజువాక: ఈ నెల 25వ తేదీనుంచి 29వ తేదీవరకు సిక్కింలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో ఎక్స్‌పో, ఎగ్జిబిషన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రెండు జాతీయ అవార్డులు దక్కాయని డిస్ట్రిక్ట్ స్కౌట్స్ స్కూల్స్ కౌన్సిలర్ పాలూరు లక్ష్మణస్వామి బుధవారం తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక స్వామి విద్యానికేతన్ హైస్కూల్ స్కౌట్స్ గ్రూపు విద్యార్థులు నలుగురు, పోర్టు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నలుగురు, జిల్లా పరిషత్ హైస్కూల్ పంచదార్ల గైడ్స్ విద్యార్థినులు ఎనిమిదిమంది కలిసి సిక్కింలో నిక్ క్యాంపులో పాల్గొన్నారని తెలిపారు. దేశంలోని 20రాష్ట్రాలు, పక్కదేశాలైన నేపాల్, బంగ్లాదేశ్, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఏపీ యొక్క చరిత్ర, వివాహ పద్ధతులు, సంస్కృతి,నృత్యం, సంగీతం, భారతీయ కరెన్సీ,స్టాంపులు ఎగ్జిబీషన్‌లో ఒక జాతీయ అవార్డును, ఏపీలో పండించే పంటలు, వంటలు, ఫుడ్‌ప్లాజా, జీవనశైలి ఎగ్జిబీషన్‌లో మరో జాతీయ అవార్డును కైవశం చేసుకున్నట్లు తెలిపారు. ఏపీ బృందానికి జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ, పోర్టు హైస్కూల్ స్కౌట్స్ టీచర్ రొక్కం మధుసూధనరావు, గైడ్స్ టీంకు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమీషనర్, పంచదార్ల జిల్లా పరిషత్ హైస్కూల్ గైడ్స్ టీచర్ రేలంగి ధనలక్ష్మి ప్రాతినిద్యం వహించారని స్వామి తెలిపారు. అవార్డులను కైవశం చేసుకున్న టీంలకు జిల్లా సెక్రటరీ పి.సుశీల, జిల్లా ట్రైనింగ్ కమీషనర్ వేణుగోపాలరావు, ఎస్.వి.రమణ, త్రినాథ్, హరీష్, ఎం.డి.ఆలీ, స్వామినాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.దేవి, పి.అనుపమాదేవి, చిట్టిబాబు షరీఫ్‌లు అభినందనలు తెలిపారు.

## కృషితో నాస్తి దుర్భిక్షం వ్యవసాయ చిత్రం షూటింగ్ పూర్తి




విశాఖపట్నం: నగరానికి చెందిన ప్రముఖ చిత్రనిర్మాణ స్వచ్ఛంద సంస్థ డిజిటల్ వీడియోస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా షుటింగ్ జరుపుకున్న

కృషి విజ్ఞాన కేంద్రం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహణలో దిగ్విజయంగా నడుస్తున్న వారి సేవల ... డాక్యుమెంటరీ చిత్రం షుటింగ్ ఈ నెల 26, 27 తేదీల్లో విజయనగరం జిల్లా కురుపాం మండలం, రాస్తా కుంటబాయ్ అనే గిరిజన గ్రామంలో ఉన్న విశాలమైన వ్యవసాయ క్షేత్రంలో షుటింగ్ పూర్తిచేశామని... చిత్ర దర్శకుడు మరియు డిజిటల్ వీడియోస్ సంస్థ అధినేత ఆర్. మణి భూషణ్ గారు తెలిపారు.... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కృషితో నాస్తి దుర్భిక్షం రైతు దేశానికి వెన్నెముక, దేశ సమగ్రత అభివృద్ధికి ...రైతన్నల సేవలు ఎంతో అవసరమని... ఈ గిరిజన ప్రాంత రైతుల్లో చైతన్యం తీసుకు వచ్చే విధంగా...వ్యవసాయ పద్ధతులు, ఆధునిక పనిముట్ల వాడకం, ఎరువుల యాజమాన్యం, బిందు సేద్య పద్ధతుల్ని, అంతర పంటల నిర్వహణ , గృహ పంటలు మరియు జంతువుల పెంపకాన్ని, వాతావరణ స్థితిగతులను, నూతన శైలి వ్యవసాయం కొరకు అవగాహన సదస్సులు... ఎంతో మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన.. కృషి విజ్ఞాన కేంద్రం వారి విలువైన సేవలను మనకు కళ్ల కు కట్టినట్టుగా చూపించే ప్రయత్నం ...ఈ డాక్యుమెంటరీ చిత్రం అని... ఈ చిత్రానికి నిర్మాణ సహాయ సహకారాలు అందించిన ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీ కె.టీ.రావు గారికి మరియు వారి సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు... ఈ చిత్రాన్ని వచ్చే నెల విడుదలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉచిత అవగాహన కొరకు ఎవరైనా మమ్మల్ని సంప్రదించవచ్చని 9848418582 తెలిపారు.



నేడు మన ప్రియతమ నాయకులు వాసుపల్లి గణేష్ కుమార్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా జిల్లా పార్టీ ఆఫీస్లో బాధ్యతలు స్వీకరించుచున్నారు, కనుక ముందుగా తెలుగుదేశం జిల్లా 27వ వార్డు అధ్యక్షులు బాపు ఆనంద్, వార్డు నాయకులు, బాలయ్య అభిమానులు అభినందనలు తెలియజేస్తున్న దృశ్యం

## జెఎన్‌టియులో అంతర్జాతీయ అవగాహన సదస్సు



కాకినాడ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకే తిక విశ్వవిద్యాలయం కాకినాడ ప్రాంగణంలో మే 9 మరియు 10 తేదీలలో అంతర్జాతీయ సదస్సును కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) వారి ఆధ్వర్యంలో నిర్వహించబోతున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.సిహెచ్.సత్య నారాయణ తెలిపారు. ఈ సదస్సుకు నాలుగు వివిధ రంగాలలో నిష్ణాతులైన ఆచార్యులను మరియు శాస్త్రవేత్తలను విదేశాల నుంచి ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలను సదస్సులో పాల్గొనబోయే అభ్యర్థులకు నిష్ణాతులకు కూలంకుషంగా వివరించనున్నారని రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నేపథ్యంలో గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ.ఎం.రామలింగరాజు గారు "కంప్యూటర్ విజన్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, స్మార్ట్ డివైజస్ అండ్ నెట్‌వర్క్స్ (సిహెచ్ఎస్ఎన్- 2020)" అను ఈ అంతర్జాతీయ సదస్సు గోడపత్రి కను ఆవిష్కరించారు. సింగపూర్ నుంచి డా.మాడే గారు విచ్చేసి కంప్యూటర్ రంగంలో నెట్‌వర్క్ భద్రతా సంబంధిత అంశాలను చర్చిస్తారు. మలేషియా నుంచి డా.హెూ చియుంగ్ చింగ్ విచ్చేసి జీవ ఆధారిత అంశాలను పరిగణనలోకి తీసుకుని వ్యక్తిగత సమాచార భద్రతను కల్పించే అంశాలపై చర్చించనున్నారు. అదేవిధంగా మలేషియా నుంచి డా.టింగ్ చూయీ విచ్చేసి సమాచార డేటా విశ్లేషణ గురించి శాస్త్రీయ దృక్పధంతో పనిచేసే తీరుపై చర్చించనున్నారు. బ్రూనై దరుసలాం నుండి డా.సోమ్ముక్ ఫోమ్ అమ్నుయాసుక్ విచ్చేసి కంప్యూటర్ వాతావరణంలో వివిధ సంక్లిష్ట విషయ సేకరణ, సమాచార మార్పిడి అత్యంత వేగవంతంగా, సమర్థవంతంగా పనిచేసే విషయాలపై విశదీకరిస్తారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు మన దేశంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థలుగా వెలుగొందుతున్న ఐఐఎస్‌సి, ఐఐటి, ఎన్ఐటి, రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుండి సుమారు 200మంది విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, ప్రముఖ ఆచార్యులు పాల్గొనబోతున్నారని కావున పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని రిజిస్ట్రార్ సిహెచ్.సత్యనా రాయణ సూచించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు రిజిస్ట్రార్ డా.సిహెచ్.సత్యనారాయణ ముఖ్య కార్యనిర్వాహక అధ్యక్షులుగా కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.డి.హరిత సమన్వయకర్తగా వ్యవహరించబోతున్నారు.



# కరోనా కలవరం!

### చైనాలో 106కి చేరిన మ ృతుల సంఖ్య.. 4,515 మందిలో వైరస్ లక్షణాలు
### హుబెయిలో చిక్కుకున్న భారతీయులను తీసుకురావడానికి భారత్ చర్యలు



న్యూఢిల్లీ: చైనాలో మొదలై ప్రపంచ దేశాల్ని వణికిస్తున్న కరోనా వైరస్ ఉద్ధ ృతి క్రమంగా పెరుగుతున్నది. చైనాలో ఈ వైరస్ తో మ ృతిచెందినవారి సంఖ్య 106కి చేరుకున్నది. మరో 4,515 మందికి ఈ వైరస్ లక్షణాలు ఉన్నట్టు వైద్యులు చెప్పారు. సోమవారం నాడే 24 మంది మ ృతిచెందినట్లు ఆ దేశ అధికార వర్గాలు తెలిపాయి. సోమవారంనాటికి మొత్తం 4,515 మంది కరోనా వ్యాధికి గురయ్యారు. వీరిలో 2,557 మంది దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. వీళ్లలో 563 మంది తీవ్ర అనారోగ్యంతోనూ, 127 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు హుబెయి రాష్ట్ర వైద్య కమిషన్ మంగళవారం పేర్కొంది. సోమవారమే హుబెయి నుంచే 31,934 మంది దవాఖానల్లో చేరినట్టు ఓ మీడియా సంస్థ తెలిపింది. చైనా రాజధాని బీజింగ్, షాంఘై నగరాలకూ కరోనా వ్యాపించింది. కరోనాపై సమీక్షకు సోమవారం చైనా చేరుకున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అధిపతి టెడ్రోస్ వ్యాధి ఉద్ధ ృతిపై అధికారులతో ఆరా తీశారు. చైనాలో చిక్కుకున్న తమ పౌరులను ఆయా దేశాలు వెనక్కి పిలవడంపై టెడ్రోస్ అభ్యంతరం తెలిపారు. దీనిపై అన్ని విష యాలను వెల్లడిస్తున్నామని టెడ్రోస్‌తో భేటీలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు.

**పలు దేశాల్లో వేగంగా వ్యాప్తి**

కరోనా విదేశాల్లోనూ వేగంగా వ్యాపిస్తున్నది. థాయిలాండ్‌లో ఏడుగురు, జపాన్(3), దక్షిణ కొరియా(3), అమెరికా(3), వియత్నాం(2), సింగపూర్(4), మలేషియా(3), నేపాల్(1), ఫ్రాన్స్(3), ఆస్ట్రేలియా(4), శ్రీలంకలో ఒక్క రు చొప్పున దీని బారిన పడ్డట్టు ఆయా దేశాలు ప్రకటించాయి. చైనా నుంచి వచ్చే పర్యాటకులకు 'వీసా ఆన్ అరైవల్(వచ్చిన వెంటనే వీసాను మంజూరుచేయడం)' సేవల్ని శ్రీలంక రద్దు చేసింది. చైనా నుంచి వచ్చిన ఓ సహోద్యోగి ద్వారా మరో ఉద్యోగికి కరోనా సోకిన ఘటన జర్మనీలో జరిగింది. మరోవైపు వుహాన్‌లో దాదా పు 2000 మంది పాక్ విద్యార్థులు చిక్కుకున్నారు. తమను వెంటనే తీసుకెళ్లాలని వాళ్లు పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు విజ్ఞప్తి చేసినట్టు మీడియా తెలిపింది. కరోనా వైరస్ 16 దేశాలకు వ్యాప్తి చెందిందని, ఆ దేశాల్లో మొత్తం 37 కరోనా కేసులు నమోదయ్యాయని చైనా అధికారిక మీడియా వెల్లడించింది.

**చైనా నుంచి వచ్చేవాళ్లు 14 రోజులు క్వారెంటైన్‌లో!**



చైనా నుంచి వచ్చే పౌరులు 14 రోజులు క్వారెంటైన్ (వైద్యుల పర్యవేక్షణ)లో ఉండాలని కేంద్రం సూచించింది. కరో నా వెలుగుచూసిన చైనాలోని హుబెయి లో చిక్కుకున్న భారతీయులను రప్పించడానికి కేంద్రం చర్యలు ముమ్మరం చేసింది. ఇందుకు సహకరించాలని చైనాకు విజ్ఞప్తి చేసింది. హుబెయిలో దాదాపు 250 మంది భారతీయులు ఉన్నట్టు సమాచారం. మరోవైపు కరోనా బాధితులను గుర్తించేందుకు దేశవ్యాప్తంగా 20 విమానాశ్రయాల్లో థర్మల్ స్క్రీనింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్టు మంగళవారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.

# నేటి నుంచి విశాఖ శారదాపీఠం వార్షికోత్సవాలు



విశాఖపట్నం: విశాఖ శారదాపీఠం వార్షికోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 5 రోజుల పాటు సాగే ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం 8 గంటలకు గురువందనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి వార్షికోత్సవాలను ప్రారంభిస్తారు. వార్షికోత్సవాల సందర్భంగా విశాఖ శారదా పీఠం ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాస చతుర్వేద హవనం చేపడుతుంది. దీనికి టిటిడి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరవుతారు.

చతుర్వేద హవనంతో పాటు పీఠం చేపట్టే పలు యజ్ఞ యాగాదుల్లో ఆయన పాల్గొంటారు. తొలిరోజున విశాఖ శారదాపీఠం రాజశ్యామల యాగాన్ని నిర్వహిస్తుంది. ఈ యాగం ఐదు రోజుల పాటు కొనసాగుతుంది. శారదా పీఠం ప్రాంగణంలోని బంగారు మందిరం వేదికగా సాయంత్రం రాజశ్యామల

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఒడిశా స్పీకర్**

**టిటిడి ఆధ్వర్యంలో శ్రీనివాస చతుర్వేద హవనం**

స్వరూప శారదా చంద్రమౌళీశ్వరులకు పీఠ పూజ నిర్వహిస్తారు. పీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వహస్తాలతో ఈ పూజా కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 6.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పద్మశ్రీ శోభానాయుడుచే శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం నిర్వహింపబడుతుంది. శారదాపీఠం వార్షికోత్సవాలు ప్రారంభానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.





**నేడు శారదాపీఠం వార్షికోత్సవాలకు ఒడిశా స్పీకర్**

ఒడిశా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సూర్య నారాయణ్ పాత్రో ప్రత్యేక అతిధిగా విచ్చేస్తున్నారు. ఈ మేరకు ఆయన భువనేశ్వర్ నుంచి రోడ్డు మార్గంలో ఇప్పటికే విశాఖ చేరుకున్నారు. అలాగే టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డితోపాటు పలువురు మంత్రులు, రాజకీయ, స్థానిక ప్రముఖులు వార్షికోత్సవాల ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు.

## గర్భిణీలకు సీమంతం నిర్వహించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ

విశాఖ సిటీః ఐవిఎఫ్ ద్వారా గర్భవతులైన 40 జంటలు కాబోయే మాతృత్వాన్ని ఒక వేడుకగా జరుపుకున్నాయి. పిల్లలు పుట్టకపోవడం (వంధ్యత్వం) అనేది భారతీయులలో ఒక అంటువ్యాధిలా ప్రబలుతున్నది. యువ జంటలలో ఎక్కువమంది వ్యంథత్వం కోసం చికిత్సను పొందుతున్నారు. భారతదేశంలో వంధ్యత్వం అనేది పెళ్లయిన జంటలలో 10 నుండి 15 శాతం వరకు గణనీయమైన ప్రభావం చూపిస్తున్నటువంటి ఒక వైద్య పరిస్థితి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రతి 4 జంటలలో ఒకరు వంధ్యత్వానికి గురవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) తెలియజేసింది.

భారతదేశంలో దాదాపు 27.5 మిలియన్ల జంటలు వంధ్యత్వం కారణంగా బాధపడుతున్నారు, అందులో కేవలం 1శాతం జంట మాత్రమే చికిత్స తీసుకోవడానికి తమంతట తాము ముందుకొస్తున్నారు. ప్రధానంగా అవగాహన లేమి మరియు ఐవిఎఫ్ / ఫెర్టిలిటీ చికిత్సలలో విజయవంతం అయ్యే రేటు చాలా తక్కువ అనే అపోహలే ఇందుకు ప్రధాన కారణంగా ఉంటున్నాయి.



మొత్తం సంతానోత్పత్తి రేటు, వయస్సు, నిర్దిష్ట సంతానోత్పత్తి రేట్ల ప్రస్తుత షెడ్యూల్



ప్రకారం పిల్లలు పుట్టే వయస్సును దాటేలోపు ప్రతి స్త్రీకి జన్మించే జననాల రేటు 1990లలో 3.9 వరకు ఉండగా 2013కు వచ్చేసరికి అది 2. 3కు తగ్గింది. పెళ్లయిన జంటలలో వంధ్యత్వానికి స్త్రీలు 40 నుండి 50 శాతం వరకు కారణంగా ఉండవచ్చని ఒక అంచనా వేసినప్పటికీ, పురుషులలో లోపాలు కూడా 35 నుండి 40 శాతం వరకు కారణంగా ఉంటూ వంధ్యత్వం రేటు పెరుగుదల కొనసాగుతున్నది. నానాటికీ ప్రమాదకర రీతిలో పెరిగిపోతున్న వంధ్యత్వ సమస్యల గురించి ఒక వైపు మాట్లాడుకుంటుండగా - ప్రముఖ ఫెర్టిలిటీ కేంద్రం అయినటువంటి ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రంలో సమర్ధవంతమైన చికిత్స విధానాలను అందిస్తూ డా రాధిక పొట్లూరి ఐవిఎఫ్ చికిత్స నేతృత్వంతో పిల్లలను పొందనున్న సుమారు 40 జంటలు పాల్గొనగా కాబోయే తల్లులకు సీమంతం (మాస్ బేబి షవర్ పేరుతో) ఉత్సవాన్ని ఎంతో ఘనంగా బుధవారం నిర్వహించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ ఫర్ రీప్రాడక్టివ్ మెడిసన్లో క్లినికల్ హెడ్ మరియు ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, డా రాధిక పొట్లూరి ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మాట్లాడుతూ, వివాహ వయస్సు పెరగడం, సంతానాన్ని వాయిదా వేస్తూ ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఎక్కువ కావడం, ఆల్కాహాల్ మరియు పొగాకు వినియోగం పెరిగిపోవడం, కదలకుండా కూర్చునే జీవనశైలితో పాటు ఫాస్ట్ ఫుడ్ వినియోగం మరియు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్న ఊబకాయం సమస్య వంటి వాటితో మన జీవనశైలిలో చాలా అధ్వాన్నమైన మార్పులు వచ్చి చేరాయి. ఎక్కువమంది చదువుకున్న మహిళలు పెళ్లిళ్లను మరియు సంతానాన్ని వాయిదా వేస్తున్నారు. తమ కేరీర్ల కారణంగా వారు బిజీ కావడంతో చిన్న కుటుంబాలకే వారు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. భారతదేశంలోని పురుషుల జనాభాలో 48 శాతం మంది వరకు ధూమపానం చేస్తున్నారు. ఇది ఇంగ్లండు మరియు అమెరికాల కంటే అధికం. ధూమపానం వీర్యకణాల సంఖ్యను, కణాల చలనశీలతను మరియు వాటి పనితీరును తగ్గిస్తుంది. సమస్యలను మరింత జటిలం చేస్తూ, పాలిసిస్టిక్ ఓవరీ సింధ్రోమ్ (పిసిఒఎస్), క్షయ మరియు పెల్విక్ ఇన్ఫెక్షన్లు వంటివి పెరుగుతున్నాయి. పిసిఒఎస్ ప్రపంచంలో 5 నుండి 10% ప్రాభల్యతను కలిగివున్నది, భారత ఉపఖండంలో వివిధ అధ్యయనాల ప్రకారం అది 4 నుండి 25% ఉంటుందని ఒక అంచనా 'గత ఆరు నెలల్లో గర్భం దాల్చిన జంటలు తమ ఆనందాన్ని ఇతర జంటలతో పంచుకునేందుకు ఒకే చోటికి చేరడం నిజంగా మాకు ఇదొక గొప్ప సందర్భం' అని ఆమె అన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ - సుధాకర్ జాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒయాసిస్ ఫెర్టిలిటి ఎలక్ట్రానిక్ విట్నెసింగ్ సిస్టమ్, పిజిటి-ఎ, ఐవిఎమ్ వంటి అత్యాధునిక సదుపాయాలు అందించడంలో ముందున్నది మరియు త్వరలో ఎఐ ద్వారా ఎంబ్రిస్కోప్ ను అందిస్తున్నది. దేశంలోనే ఆంఢ్రోలైఫ్ అనబడే మేల్ ఫెర్టిలిటీకి చెందిన ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఇందులో కలిగివున్నది.' - ఒయాసిస్ సెంటర్ ఫర్ రీ ప్రొడక్టివ్ మెడిసిన్ గురించి : సద్గురు హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ లో భాగమైన ఒయాసిస్ సెంటర్ ఫర్ రీ ప్రొడక్టివ్ మెడిసిన్, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అత్యుత్తమ వైద్య నియమావళిని మరియు పద్ధతులను అందుబాటులోకి తీసుకురాడం ద్వారా దక్షిణ భారతదేశంలోనే సంతాన సాఫల్యానికి ఒక సరికొత్త నిర్వచనాన్ని అందించింది. ఈ కేంద్రంలో కన్సల్టేషన్, ఇన్వెస్టిగేషన్ మరియు ట్రీట్మెంట్లకు సంబంధించి ఈ రంగంలో అమలు అవుతున్న విధానాలకు భిన్నంగా ఒక సరికొత్త పద్ధతిలో ఒకే చోట, ఒకే రోజు నిర్వహించి తద్వారా కస్టమర్ ఫ్రెండ్లీగా ఉంటూ అన్ని వైద్య సేవలను కూడా ఒక్క రోజులోనే 'ఒన్ స్టాప్'గా అందిస్తున్నది. 2009లో స్థాపించినప్పటి నుండి ఒయాసిస్ అంతర్జాతీయ అనుభవంతో అత్యంత అనుభవజ్ఞులైన ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ బృందం నేతృత్వంలోని అధిక-నాణ్యత సేవల ద్వారా నడిచే అధిక విజయాల రేట్ తో అద్భుతమైన ఖ్యాతిని పొందింది. ఒయాసిస్ కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, జార్ఖండ్ గుజరాత్ వంటి రాష్ట్రాలో ప్రస్తుతం 12 కేంద్రాలు ఉన్నాయి. For further information, please contact : 9963980259/ 9985310069

## చంద్రబాబు, పవన్, కన్నా.. ముగ్గురూ అభివృద్ధి నిరోధకులే



విజయవాడ : చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, కన్నా లక్ష్మీనారాయణ ముగ్గురు ఒకే డైరెక్షన్‌లో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధి నిరోధకాలుగా తయారయ్యారని, సీఎం జగన్మోహన్ రెడ్డికి ప్రజల అండ ఉందని, రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడ నగర అభివృద్ధి కి కట్టుబడి ఉన్నారని మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మంత్రి నగరంలో పలుచోట్ల రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. పశ్చిమ నియోజకవర్గంలో సి సి రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరించడం, త్రాగునీటి సౌకర్యం మెరుగుపరచడంవంటి అభివృద్ధి కార్యక్రమాలు కోట్లాది రూపాయల నిధులను విడుదల చేయడం జరిగిందని తెలియజేశారు. నియోజవర్గంలో 25, 27, 28, 30, 31, 33, 36 , 37, 38, 39వ డివిజన్లలో భూమి పూజ, శంకుస్థాపన మంత్రితో పాటు ఆయా డివిజన్ల వైసీపీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు మరియు నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి.... పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిని పెడ చెవిన పెట్టిందన్నారు. 20 డివిజన్లులో ను అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం విజయవాడ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇందులో భాగంగానే కోట్ల రూపాయల నిధులను విడుదల చేసి నగర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లోని పలు డివిజన్లలో ఈరోజు అభివృద్ధి పనులనిమిత్తం సుమారు 2 కోట్ల రూపాయలు నిధులతో శంకుస్థాపన కార్యక్ర మాలను చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం, త్రాగునీటి సౌలభ్యాన్ని పెంపొందించడం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు.

## చారిటీ పేరుతో నైజీరియన్ ముఠా ఆన్‌లైన్ మోసం





విశాఖపట్నం : విశాఖలో పెద్ద ఎత్తున జరుగుతున్న ఆన్‌లైన్ మోసాన్ని సైబర్ క్రైం పోలీసులు అడ్డుకున్నారు. చారిటీ పేరుతో మోసాలకు పాల్పడుతున్న నైజీరియన్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. కాగా అరైస్టైన వారిలో నలుగురు నైజీరియన్లతో పాటు మేఘాలయకి చెందిన ఒక మహిళ ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వివరాలు.. విశాఖపట్నంలో నివసిస్తున్న సంజయ్ సింగ్ అనే వ్యక్తి ఒక నైజీరియన్ సంస్థ నుంచి రూ.39 కోట్ల తమ ఆస్తిని ఇండియాలో చారిటీ కోసం వినియోగించనున్నామంటూ మెయిల్ వచ్చింది. మీరు కూడా మీ వంతు సాయం చేయాలనుకుంటే అకౌంట్‌కు డబ్బు పంపించవచ్చంటూ అందులో పేర్కొంది. దీంతో మెయిల్‌కు స్పందించిన సంజయ్ సింగ్ తన వ్యక్తిగత వివరాలను పంపించాడు. దీంతో కస్టమ్స్,లీగల్ ఫార్మాలిటీస్ పేరుతో సంజయ్ సింగ్ వద్ద నుంచి పెద్ద మొత్తంలో గుంజడానికి ప్రయత్నించింది.

ఈ నేపథ్యంలో నైజీరియన్ ముఠా వలలో చిక్కుకున్న సంజయ్ రూ. 6.62 లక్షల రూపాయలను వివిధ అకౌంట్లకు పంపించాడు. తర్వాత వారి దగ్గర నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన సంజయ్ సింగ్ విశాఖ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

బాధితుని ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నైజీరీయన్ ముఠాను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. కాగా వీరికి సహకరించిన మేఘాలయ రాష్ట్రానికి చెందిన మహిళను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నైజీరియన్ ముఠా నుంచి 55 వేల నగదు, రెండు లాప్‌టాప్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు, ఏడు సిమ్‌కార్డులు, రెండు ఏటీఎం కార్డులు, పాస్-పోర్టులు, వారి బ్యాంకు అకౌంట్లలో ఉన్న రూ. 1.46 లక్షల నగదును సీజ్ చేసనట్లు పోలీసులు వెల్లడించారు.

## టీమిండియాలో రో'హిట్'

**ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కోహ్లి సేనదే విజయం**

**చివరి ఓవర్‌లో మ్యాజిక్ చేసి మ్యాచ్‌ను టై చేసిన షమీ**

**కివీస్ సారథి కేన్ విలియమ్సన్ పోరాటం వృథా**



హామిల్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ-20లో టీమిండియా సూపర్ విజయాన్ని అందుకుంది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో చివరికి విజయం కోహ్లి సేననే వరించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అనంతరం 180 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్

**రోహిత్ సూపర్ ఇన్నింగ్స్**

నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగుల వద్దే నిలిచింది. దీంతో ఇరుజట్ల స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ టై అయింది. దీంతో మ్యాచ్ విజేత సూపర్ ఓవర్‌తో తేలింది. సూపర్ ఓవర్‌లో భాగంగా తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 17 పరుగులు చేసింది. బుమ్రా బౌలింగ్ చేయగా, విలియమ్సన్, గప్టిల్‌లు బ్యాటింగ్ చేశారు. ఇక అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు రోహిత్, రాహుల్‌లు జట్టుకు విజయాన్ని అందించారు. టిమ్ సౌతీ వేసిన ఈ ఓవర్‌లో రోహిత్ రెండు సిక్సర్లు కొట్టగా, రాహుల్ ఓ ఫోర్ కొట్టి జట్టుకు విజయాన్ని అందించారు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో టీమిండియా కైవసం చేసుకుంది. సూపర్ ఓవర్‌లో టీమిండియాకు సూపర్ విజయాన్ని అందించిన రోహిత్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com